

● వైన్ షాపులో అమ్మకానికి సిద్ధంగా ఉన్న మద్యం బాటిళ్లు

## ఎక్సైజ్ శాఖలో.. టార్గెట్స్

# లొల్లి!

మద్యం సేల్స్‌ను.. మరింతగా పెంచాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం ఎక్సైజ్ శాఖలో హాట్‌టాపిక్‌గా మారింది. దాదాపు డిసెంబరు ముగుస్తున్నా.. అనుకున్నంత స్థాయిలో అమ్మకాలు జరుగక పోవడం తో ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారులు హడావుడి చేస్తున్నారు. డిసెంబరు 31, న్యూ ఇయర్ వేడుకల ను దృష్టి లో పెట్టుకుని ఈసారి టార్గెట్‌ను భారీగా పెంచినట్లు తెలుస్తుంది.

- జిల్లాలో రూ.42 కోట్ల విలువైన మద్యం అమ్మకాల లక్ష్యం
- మద్యం సేల్స్ పెంచాలంటూ వార్నింగ్‌లు
- డిసెంబర్‌లో భారీ సేల్స్‌కు ఎక్సైజ్ శాఖ ప్లాన్
- టార్గెట్‌లతో తంటాలు పడుతున్న అధికారులు
- జిల్లావ్యాప్తంగా మొత్తం 42 మద్యం షాపులు, 12 బార్లు

ఆదిలాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదిలాబాద్, ఉట్నూర్, ఇచ్చోడ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో రూ.42 కోట్ల మద్యం అమ్మకాలే లక్ష్యంగా ఎక్సైజ్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో 42 మద్యం షాపులు, 12 బార్లు ఉన్నాయి. అలాగే బెల్ట్‌షాపులు ఊరువాడలా వేలల్లో ఉండడంతో విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయి. అయితే, ప్రతియేడు డిసెంబరు మాసంలో మద్యం సేల్స్ ను పెంచేలా అధికారులు ముందస్తు చర్యలు చేపడుతున్నా.. ఈసారి మాత్రం భారీగా టార్గెట్‌ను విధించడంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతేడు అసెంబ్లీ ఎన్నికలు ఉండడంతో అనుకున్న లక్ష్యం చేరుకున్నా.. ఈయేడు మాత్రం టార్గెట్ పూర్తికావడం కష్టసాధ్యమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. అయినా ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో మద్యం సేల్స్ పెంచేలా జిల్లా అధికారులు పడరాని పాట్లు పడుతున్నారు.

### గత ఏడాది మాదిరిగానే టార్గెట్ వస్తుంది

: హిమాశ్రీ, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్



గతేడు మాదిరిగానే టార్గెట్ వచ్చేలా ప్రయత్నాలు చేస్తున్నాం. కానీ గతంలో కొత్త షాపులు ఉండడంతో బాగానే ఆదాయం వచ్చింది. ఈసారి కూడా అదే స్థాయిలో సేల్స్ ఉంటాయని అంచనా వేస్తున్నాం. డిసెంబరుమాసంలో సుమారుగా రూ.40 కోట్ల వరకు ఆదాయం వస్తుందని అనుకుంటున్నాం. ప్రభుత్వం నుంచి ఎలాంటి టార్గెట్లు లేవు. ప్రతీసారి డిసెంబరు మాసంలో మద్యం సేల్స్ ఎక్కువగానే ఉంటాయి.

### అధికారులపై ఒత్తిడి

డిసెంబరు మాసంలో మద్యం సేల్స్‌ను భారీగా పెంచాలంటూ అధికారులపై ఒత్తిళ్లు పెరుగుతున్నాయి. దీంతో అదనంగా మద్యాన్ని లిఫ్టు చేయాలంటూ అధికారులు లిక్కర్ వ్యాపారుల వెంట పడుతున్నారు. ఆదిలాబాద్ స్టేషన్ పరిధిలో రూ.23 కోట్లు, ఇచ్చోడ పరిధిలో రూ.10 కోట్లు, ఉట్నూర్ పరిధిలో రూ.5కోట్ల మద్యం సేల్స్ టార్గెట్‌ను విధించినట్లు తెలుస్తుంది. అలాగే అదనంగా మరో రూ.4కోట్ల మద్యం అమ్మకాలను చేపట్టాలంటూ ఉన్నతాధికారులు ఆదేశాలను జారీ చేసినట్లు తెలుస్తుంది. అంతేకాకుండా ఎట్టిపరిస్థితుల్లో టార్గెట్ రీచ్ కావాలంటూ పదేపదే హెచ్చరికలు, వార్నింగ్‌లు ఇవ్వడంతో జిల్లా అధికారులు తర్జనభర్జన పడుతున్నారు. ఇప్పటి వరకు రూ.15కోట్ల వరకే మద్యం అమ్మకాలు జరిగినట్లు తెలుస్తుంది. మిగితా రూ.27 కోట్ల విలువైన మద్యాన్ని 17 రోజుల్లో పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారు లు ఆదేశాలు జారీ చేస్తున్నారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో కాదనలేక మద్యం సేల్స్ పెంచాలని వ్యాపారుల వెంట పడలేక అధికారులు సతమతమవుతున్నారు.

### ఎక్సైజ్ శాఖ ముందుచూపు

ఏడాదిలో డిసెంబరు మాసంలోనే మద్యం సేల్స్ భారీగా ఉంటాయి. ఎందుకంటే డిసెంబరు 31, న్యూ ఇయర్ వేడుకలతో సేల్స్ మరింతగా





పెరిగే అవకాశం ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. గతంలో కంటే ఈసారి అదనంగా అమ్మకాలు జరుపాలంటూ ఎక్సైజ్ శాఖ ముందస్తు ప్లాన్‌ను సిద్ధం చేసినట్లు తెలుస్తుంది. గత ఏడాది డిసెంబరులో రూ.30కోట్లకు పైగా మద్యం అమ్మకాలు జరపగా.. ఈసారి మాత్రం అదనంగా.. రూ.12 కోట్ల టార్గెట్‌ను పెంచినట్లు తెలుస్తుంది. కానీ ఆదిలాబాద్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తప్ప ఇచ్చోడ, ఉట్నూర్ ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలో మద్యం సేల్స్ నామమాత్రంగానే కనిపిస్తున్నాయి. దీంతో అనుకున్న టార్గెట్‌ను

(మిగతా 6వ పేజీలో...)



ఆదిలాబాద్ పట్టణంలో దట్టంగా కనిపిస్తున్న పొగమంచు

## వణుకు పుట్టిస్తున్న చలి

● అర్లి(టి)లో 8.3 డిగ్రీల కనిష్ఠ ఉష్ణోగ్రత నమోదు

ఆదిలాబాద్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గత వారం రోజులుగా కనిష్ఠ ఉష్ణోగ్రతలు వేగంగా పడిపోవడంతో జిల్లాలో చలి తీవ్రత కనిపిస్తోంది. శుక్రవారం జిల్లా సగటు గరిష్ఠ ఉష్ణోగ్రత 28.0 డిగ్రీలు కాగా, కనిష్ఠంగా 8.7 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అలాగే బేలలో 8.7 డిగ్రీలు, బోథ్‌లో 8.8, ఆదిలాబాద్ రూరల్‌లో 9.0, మావలలో 9.2, తలమడుగులో 9.6, జైనథ్‌లో 9.9 కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. జిల్లావ్యాప్తంగా 15 డిగ్రీల లోపే కనిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో పగటిపూటనే చలిమంటలు వేసుకోవడం గమనార్హం. ముఖ్యంగా తీవ్రమైన చలితో పత్తి పంటపై ప్రభావం కనిపిస్తోంది. అలాగే శనగ, జొన్న పంటకు మేలు చేస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఉదయం వేళల్లో దట్టమైన పొగమంచు కమ్మేయడంతో 8గంటల వరకు జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. చలితో పశువులు గొంగురబోయి కనిపిస్తున్నాయి. మరికొన్ని రోజుల పాటు జిల్లాపై చలి ప్రభావం ఉంటుందని వాతావరణ శాఖ నిపుణులు పేర్కొంటున్నారు.

### 'పాఠశాల సమయాల్లో మార్పు చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లాలో చలి తీవ్రత పెరుగుతున్న దృష్ట్యా పాఠశాలల సమయాల్లో మార్పులు చేయాలని సీపీఐ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సిర్రదేవేందర్ పేర్కొన్నారు. శుక్రవారం డీఈవో ప్రణీతను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉదయం సమయంలో స్కూల్ పిల్లలు చలితో ఇబ్బందులు పడకుండా పాఠశాలల టైమింగ్స్‌ను మార్చాలని కోరారు. ఈ విషయమై డీఈవో సానుకూలంగా స్పందించినట్లు ఆయన తెలిపారు.

### నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

తలమడుగు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తలమడుగు మండలానికి సంబంధించిన కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులు మధ్యాహ్నం 1 గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌ల చేతుల మీదుగా పంపిణీ చేయడం జరుగుతుందని తహసీల్దార్ రాజ మోహన్ పేర్కొన్నారు. చెక్కుల పంపిణీ కార్యక్రమం బోథ్ మండలంలోని పరిచయ గార్డెన్‌లో నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి కల్యాణలక్ష్మి చెక్కుల లబ్ధిదారులు సకాలంలో హాజరై విజయవంతం చేయాని తహసీల్దార్ ఈ సందర్భంగా కోరారు.



చదువుల్లో విద్యార్థుల సామర్థ్యాన్ని అడుగుతున్న కలెక్టర్



ఎస్టీ బాలికల హాస్టల్‌లో వండిన భోజనం రుచి చూస్తూ..

## మెనూ ప్రకారం భోజనం అందించాలి

● జిల్లా కలెక్టర్ రాజర్షిషా

బోథ్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని కలెక్టర్ రాజర్షిషా అన్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ బాలికల హాస్టల్‌లో శుక్రవారం కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్‌లో దాదాపు గంటసేపు ప్రతీ విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. హాస్టల్‌లో విద్యార్థులకు అందుతున్న భోజన వసతులను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాక స్టాక్ రూమ్‌లో ఉన్న నిల్వలను పరిశీలించారు. అనంతరం మరుగుదొడ్లను పరిశీలించి విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా చూడాలని హాస్టల్ వార్డెన్, పాఠశాల ప్రిన్సిపాల్‌ను ఆదేశించారు. ఆ తర్వాత విద్యార్థులతో దాదాపు అర గంటసేపు మాట్లాడారు. విద్యార్థులకు చదువులో ఉన్న సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. చదువులు ఎలా సాగుతున్నాయి? విద్యాబోధన సక్రమంగా జరుగుతుందా? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్లో విద్యార్థుల కోసం వండిన భోజనాన్ని కలెక్టర్ స్వయంగా రుచి చూశారు. అక్కడే ఉన్న వంట సిబ్బందికి పలు సూచనలు చేశారు. హాస్టల్లో ఆహార కలుషితం వల్ల విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఎస్సీ ఆర్పీలు తమ ఇబ్బందులను వివరిస్తూ వినతిపత్రం అందించారు. హాస్టల్లో విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గదులు లేవని, కాంపౌండ్ వాల్ నిర్మాణం జరిగేలా చూడాలని హాస్టల్ ప్రిన్సిపాల్, వార్డెన్లు కలెక్టర్‌కు విన్నవించారు. ఎన్ఆర్ఈజీఎస్ కింద సత్వరమే పనులు పూర్తి చేయిస్తామని వివరించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం వసతి కల్పించాలని మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఆర్డీవో వినోద్‌తో పాటు స్థానిక తహసీల్దార్ సుభాష్ చంద్ర, ఎంపీడీవో రమేష్ పలువురు అధికారులు ఉన్నారు. పూర్తిస్థాయి వసతులను కలెక్టర్ గంటసేపు పరిశీలించడం జరిగింది.



మంత్రి కార్యక్రమ ఏర్పాట్ల విషయమై అధికారులతో మాట్లాడుతూ..

### ● మంత్రి పర్యటన ఏర్పాట్ల పరిశీలన

బోథ్(ఆంధ్రజ్యోతి): బోథ్‌లో శనివారం మంత్రి సీతక్క పర్యటన ఏర్పాటను కలెక్టర్ రాజర్షిషా శుక్రవారం పరిశీలించారు మొదట మంత్రి ప్రారంభించనున్న సబ్ రిజిస్టర్ కార్యాలయాన్ని పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ సుభాష్‌చంద్రతో కార్యక్రమ నిర్వహణపై మాట్లాడారు. అక్కడి నుండి మంత్రి పాల్గొనే పరిచయ గార్డెన్‌లో వసతులను పరిశీలించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో వినోద్ తో పాటు స్థానిక ఎంపీడీవో రమేష్‌లు ఉన్నారు.

### ● నేడు ఇచ్చోడ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం

ఇచ్చోడ(ఆంధ్రజ్యోతి): ఇచ్చోడ మార్కెట్ కమిటీ చైర్మెన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకార మహోత్సవానికి మంత్రి సీతక్క రానున్నట్లు కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి పసుల చంటి ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని గంగారెడ్డి గార్డెన్‌లో జరగనున్న ప్రమాణ స్వీకారం కార్యక్రమానికి ఉదయం 11 గంటలకు హాజరై ప్రసంగించనున్నట్లు వారు పేర్కొన్నారు. ఇక్కడి నుంచి నేరుగా పలు అభివృద్ధి కార్యక్రమాలపై నేరడిగొండ, బోథ్ మండలాల పర్యటనకు వెళ్లనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్టీ నాయకులు కోరారు.

### ● మంత్రి సీతక్కతో సమావేశం

నేరడిగొండ(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని క్యాంప్ కార్యాలయంలో శనివారం జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క సమావేశం నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ నేరడిగొండ మండల అధ్యక్షుడు ఆడే వసంత్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు జరిగే ఈ సమావేశానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు.

## నేటి నుంచి ఆశ్రమ పాఠశాలల్లో కొత్త మెనూ అమలు



గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో చదువుకుంటున్న బాలికలు

● ఆనందంలో విద్యార్థులు

ఉట్నూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన సంబరాలు పురస్కరించుకొని శనివారం నుంచి ప్రారంభించనున్న స్పెషల్ మెనూతో గురుకుల విద్యాలయాలు, ఆశ్రమ విద్యాలయాల్లో విద్యనభ్యసిస్తున్న విద్యార్థి లోకంలో ఆనందోత్సాహాలు వెల్లి విరుస్తున్నాయి. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని సమగ్ర గిరిజన అభివృద్ధి సంస్థ పరిధిలో మొత్తం 123 ఆశ్రమ పాఠశాలలతో పాటు వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, గురుకుల జూనియర్ కళాశాలలు, గురుకుల డిగ్రీ కళాశాలలు కొనసాగుతుండగా.. వేలాది మంది గిరిజన విద్యార్థులు చదువుకుంటున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలోని తెలంగాణ ప్రభుత్వం ప్రజాపాలన సంబరాలు పురస్కరించుకొని విద్యార్థి లోకానికి తీపికబురు చెప్పడంతో పాటు శనివారం నుంచి అమలు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో మూడవ తరగతి నుంచి ఏడవ తరగతి వరకు ఒక్కొక్క విద్యార్థికి నెలకు రూ.950 ఉండగా.. దీనిని రూ.1330కి పెంపుదల చేశారు.

అదేవిధంగా 8వ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుకుంటున్న విద్యార్థులకు రూ.1100 ఉండగా రూ.1540కి పెంచారు. ఇంటర్మీడియట్ నుంచి డిగ్రీ, పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు చదువుకుంటున్న విద్యార్థులకు ప్రస్తుతం అమలులో ఉన్న నెలకు రూ.1500 నుంచి రూ.2100 వందలకు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన నిధులతో వివిధ ప్రాంతాల్లోని విద్యా సంస్థల్లో పని చేస్తున్న హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్లు, డిప్యూటీ వార్డెన్లు ప్రభుత్వం ప్రకటించిన మెనూ ప్రకారం వారినికి నాలుగుసార్లు మాంసాహార భోజనం వడ్డించాలని ఆదేశాలు జారీ చేశారు. కాగా, స్పెషల్ మెనూ పట్ల విద్యార్థి లోకం హర్షం వ్యక్తం చేస్తోంది.



వాంకిడిలో ఓ ఇంటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో రాజ్‌వీర్

### పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వే

నేరడిగొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): పకడ్బందీగా ఇందిరమ్మ ఇళ్ల సర్వేను చేపడుతున్నామని ఎంపీడీవో రాజ్‌వీర్ అన్నారు. శుక్రవారం మండలంలోని వాంకిడి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పరిశీలన చేపట్టారు. ఇందిరమ్మ ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఇంటింటికి వెళ్లి పంచాయతీ సిబ్బంది పరిశీలించడం జరుగుతుందన్నారు. అర్హులైన లబ్ధిదారుల జాబితాను తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతామన్నారు. ఇళ్ల మంజూరులో అవకతవకలకు తావులేకుండా చూస్తామన్నారు. ఆయన వెంట ఏపీవో వసంత్‌రావ్, పంచాయతీ కార్యదర్శి రాఘవ తదితరులున్నారు.

### గ్రూప్-2కు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఈనెల 15, 16న నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు ఆదిలాబాద్ డిపో మేనేజర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సులను ఆదిలాబాద్ నుంచి బంగారిగూడ, ఆదిలాబాద్ నుంచి పిప్పర్‌వాడకు ఉదయం 8గంటల నుంచి సాయంత్రం 7.30గంటల వరకు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థుల కోసం ఆదిలాబాద్ బస్‌స్టేషన్‌లో 'మే ఐ హెల్ప్‌యు సెంటర్'ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. అభ్యర్థులు ఫోన్ నెం.83310 33707 ద్వారా సంప్రదించాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు వినియోగించుకోవాలని కోరారు.

### టాస్క్‌ఫోర్స్ సభ్యుడి తనిఖీలు

ఉట్నూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఏర్పడిన ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బృందంలోని టాస్క్‌ఫోర్స్ సభ్యుడు ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుడిమెత మనోహర్ ఉట్నూర్ మండలంలోని బాలికల మేనేజ్‌మెంట్ హాస్టల్‌తో పాటు సాలెగూడ కోలాం శాటిలైట్ సెంటర్‌లను తనిఖీ చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశానుసారం ఆయా విద్యా సంస్థల్లో విద్యార్థులు ఆరోగ్యంతో పాటు, పరిసరాల పరిశుభ్రత, స్నానాల గదులు, మరుగుదొడ్లు పరిశీలించారు. అనంతరం విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించడంతో పాటు గిరిజన సహకార సంస్థ ద్వారా సరఫరా అవుతున్న ఆహార వస్తువుల నాణ్యతను పరిశీలించారు. విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అనారోగ్యానికి గురయితే ఆసుపత్రులకు తరలించాలని, ఎట్టి పరిస్థితుల్లో వారిని ఇళ్లకు పంపించవద్దని ఆదేశించారు. ఆహారంలో నాణ్యత లోపించకుండా చూసుకోవాలన్నారు. ఇటీవల ఉమ్మడి జిల్లాలోని వాంకిడి ఆశ్రమ పాఠశాలలో ఆహారం నాణ్యత లోపించడం వల్లనే కలుషిత ఆహారం తిన్న బాలికలు అస్వస్థత గురయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో చాయ, ఇన్‌చార్జీ హెచ్‌ఎం దుర్వ గంగారాం, వైద్య సిబ్బంది రాథోడ్ గణేష్, నాందేవ్, శ్రీనివాస్ చౌహాన్, తదితరులు పాల్గొన్నారు.

### ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖ ప్రసవాలు

నేరడిగొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆసుపత్రుల్లోనే సుఖ ప్రసవాలు జరుగుతాయని అడిషనల్ డీఎంహెచ్‌వో సాధన అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. పలు రికార్డులను పరిశీలించిన అనంతరం సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రులలోనే ప్రసవాలు జరిగేలా చూడాలన్నారు. హైరిస్క్ ఉన్న కేసులను సత్వరమే ఆదిలాబాద్ రిమ్స్‌కు పంపించాలని ఆదేశించారు. గర్భిణులకు క్రమం తప్పకుండా పరీక్షలు చేసి మందులను పంపిణీ చేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలలో పోషక ఆహారం అందిస్తున్నారా? లేదా అనే విషయాలను ప్రతీ రోజు పరిశీలించాలని సిబ్బందిని ఆదేశించారు. ఇందులో హెచ్‌ఈవో పవార్ రవీందర్, సిబ్బంది, తదతరులు ఉన్నారు.

### ఎమ్మెల్యేను కలిసిన పలు గ్రామాల ప్రజలు

నేరడిగొండ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్‌ను శుక్రవారం పలు గ్రామాల ప్రజలు కలిసి స్థానికంగా నిర్వహించే కార్యక్రమాలకు ఆహ్వానం పలికారు. దీనిలో భాగంగా తలమడుగు మండలంలోని సాయిలింగి గ్రామంలో ఈ నెల 24న జరిగే సాయినాథుని జాతరకు రావాలని కోరారు. తాంసి మండలం లోని గిరిగాం గ్రామంలో గల దత్తాత్రేయ ఆలయ వార్షికోత్సవానికి హాజరు కావాలని కోరారు. కాగా, బజార్‌హత్నూర్ మండలానికి చెందిన గాండ్ల శ్రీనివాస్ బీజేపీని వీడి చట్ల తరుణ్ అధ్వర్యంలో బీఆర్ఎస్‌లోకి చేరగా ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

### ప్రతిభను వెలికి తీసేందుకే క్రీడా పోటీలు

ఇచ్చోడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యాలకు కొదవలేదని, వారిలో ప్రతిభను వెలికితీసేందుకు సీఎం కప్ క్రీడలను నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో లక్ష్మణ్ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మండల స్థాయి క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యువకులు, విద్యార్థులు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. సీఎం కప్‌లో తెలంగాణ గిరిజన బాలికల పాఠశాల ఇచ్చోడకు చెందిన విద్యార్థినులు, ఖోఖో, కబడ్డీ, అథ్లెటిక్స్ తదితర విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. రాబోయే జిల్లాస్థాయి టోర్నమెంట్లలో ఉత్తమ ప్రదర్శన కనబర్చి మండలానికి ప్రత్యేక గుర్తింపు తీసుకురావాలని పాఠశాల ప్రిన్సిపాల్ రోజారాణి సూచించారు. బహుమతులు సాధించిన విద్యార్థులకు పాఠశాల సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు. ఇందులో వైస్ ప్రిన్సిపాల్ లలిత, గీతాంజలి, పీడీ స్రవంతి, నందిని, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



సీఎం కప్ క్రీడా పోటీల్లో బహుమతులు సాధించిన గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు

## నేడు షాంపూర్‌లో ప్రజాపాలన పండుగ

ఉట్నూర్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం యేడాది కాలం పూర్తికావడంతో ప్రజాపాలనపండుగ ఘనంగా నిర్వహిస్తుంది. ఉట్నూర్ మండలంలోని షాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రజాపాలన పండుగ ఘనంగా నిర్వహించడానికి జిల్లా ఇన్‌చార్జీ మంత్రి ధనసరి అనసూయ సీతక్క హాజరు అవుతుండడంతో జిల్లా అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. ఖానాపూర్ నియోజకవర్గంలోని ఉట్నూర్ మండలంలో పలు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు మంత్రి హాజరుకానున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలోని లక్కారం నుంచి చింతగూడ వరకు రోడ్లు భవనాల శాఖ ఆధ్వర్యంలో నిర్మించతలపెట్టిన రూ.8 కోట్ల డబుల్‌రోడ్డు నిర్మాణ పనులకు మంత్రితో పాటు ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ హాజరై శంఖుస్థాపన చేయనున్నారు. ఘనపూర్ సమీపం నుంచి ఉమ్మడి జిల్లాలోని జైనూర్ మండలం శివనూర్ రోడ్డు నిర్మాణ పనులకు రూ.3.20తో భూమిపూజ చేయనున్నారు. కొత్తగూడ(జి)లో రూ.20లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులకు ప్రారంభోత్సవం చేస్తారని, అనంతరం షాంపూర్‌లో జరిగే ప్రజాపాలన పండుగ కార్యక్రమంలో హాజరైన అనంతరం ఇంద్రవెల్లి, గుడిహత్నూర్, నేరడిగొండ మండలాల్లో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ఈ మేరకు సంబంధిత శాఖల అధికారులు ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు.

## అంబులెన్స్ తనిఖీ

ఉట్నూర్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉట్నూర్ మండల కేంద్రంలోని జీవీకే ఈఎంఆర్‌ఐ 108 డివిజన్ ఆఫీస్‌లో ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వామాట్ ఉట్నూర్, ఇంద్రవెల్లి, 108, 102 అంబులెన్స్ వాహనాలను తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. వాహన నిర్వహణ, వైద్య పరికరాలు పరిశీలించి వాటి ఉపయోగాల గురించి సిబ్బందికి అవగాహన కల్పించారు.

## వృద్ధులకు చిన్నారుల దుప్పట్ల పంపిణీ

ఇచ్చోడ, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని సన్‌షైన్ పాఠశాలలో శుక్రవారం ఫుడ్ ఫెస్టివల్, వెజిటెబుల్ మార్కెట్ కార్యక్రమాన్ని జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారం, నాణ్యమైన ఆహారం, కూరగాయాలు, ఆకుకూరలు వాటి ఉపాయోగాలు, చిరుతిండ్లకు వ్యత్యాసాన్ని పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది వివరించారు. విద్యార్థులు వారి వెంట తీసుకువచ్చిన వివిధ రకాల ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయాలను విక్రయించడం జరిగింది. విద్యార్థులు విక్రయించగా వచ్చిన సొమ్ముతో అనాథలుగా ఉన్న వృద్ధులకు దుప్పట్లను పంపిణీ చేశారు. ఇందులో పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్ కుమార్, యాజమాన్యం గణేష్, రాకేష్, సంజయ్, తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, డిసెంబరు13 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని గిరిజన ఉపాధ్యాయుల సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జాదవ్ చంద్రకాంత్‌నాయక్ డిమాండ్ చేశారు. యేడాది పాలన పూర్తి అయిన సందర్భంగా సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల సంబరాలు ఎప్పుడని జాదవ్‌చంద్రకాంత్‌నాయక్ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం దీక్ష శిబిరాన్ని సందర్శించి సంఘీభావం ప్రకటించారు. హక్కుల సాధన కోసం చేస్తున్న పోరాటానికి తమ సమితి సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తుందని స్పష్టం చేశారు.

● హామీలను వెంటనే నెరవేర్చాలి

**ఆదిలాబాద్ రూరల్(ఆంధ్రజ్యోతి):** సీఎం రేవంత్ రెడ్డి సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఆదిలాబాద్‌లోని కలెక్టరేట్ వద్ద దీక్ష శిబిరంలో ఉద్యోగులు చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఎస్టీయూ, ఏఐటీయూసీ సంఘాల సభ్యులు మద్దతు తెలిపారు.

## 'జిల్లా మహాసభలు జయప్రదం చేయండి'

తలమడుగు, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు కొల్లూరి శంకర్‌లు తెలిపారు. శుక్రవారం మండల కేంద్రంలో టీఎస్ యూటీఎఫ్ ఆరో మహాసభలకు సంబంధించిన పోస్టర్లను మండల విద్యాధికారితో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు.

# కుష్టు నివారణే లక్ష్యంగా చర్యలు : రాష్ట్ర పరిశీలకుడు



ఇంద్రవెల్లిలో సర్వే తీరును పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకుడు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): కుష్టు నివారణే లక్ష్యంగా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని కుష్టు గుర్తింపు సర్వే రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రదీప్ కుమార్ అన్నారు. జిల్లాలో కొనసాగుతున్న కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వేను ఆయన శుక్రవారం పరిశీలించారు. పట్టణంలోని హమాలివాడ అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో పర్యటించారు. ఆశా కార్యకర్తలు నిర్వహిస్తున్న సర్వే తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. అనుమానితులు తప్పిపోకుండా చూడాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కుష్టు గుర్తింపు సర్వే రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ ప్రదీప్ కుమార్ మాట్లాడుతూ ఎన్‌సీడీసీ కార్యక్రమంలో భాగంగా కుష్టు అనుమాతుల సర్వే కొనసాగుతుందన్నారు. వీరిని పరీక్షించి కుష్టు ఉందా లేదా ఇతర సంబంధిత వ్యాధులున్నాయని తెలుసుకోవడం జరుగుతుందన్నారు. జిల్లాలో లక్ష 76 వేల 426 ఇండ్లకు లక్ష 54 వేల 25 ఇండ్ల సర్వే పూర్తి అయిందన్నారు. అదేవిధంగా 6 లక్షల 39 వేల 106 మందిని పరీక్షించి 800 మంది అనుమానితులను గర్తించడం జరిగిందన్నారు. ఇంకా రెండు రోజుల సమయం ఉందని, వంద శాతం పూర్తి చేసేల ప్రణాళికలు చేసుకోవాలని సూచించారు. కుష్టును ముందుస్తుగా గుర్తిస్తే నివారణకు చికిత్సలు పొందవచ్చని తెలిపారు. సర్వేకు వెళ్లే ఆశా కార్యకర్తలు ఏ ఒక్కరు తప్పిపోకుండా పూర్తి స్థాయిలో వివరాలను నమోదు చేయాలన్నారు. తప్పిదలు జరిగితే శాఖ పరంగా చర్యలుంటాయని హెచ్చరించారు. ఈనెల 2వ తేదీ నుంచి కుష్టు అనుమానితుల గుర్తింపు సర్వే ప్రారంభమైందని కుష్టు నివారణ అధికారి డాక్టర్ గజానంద్ తెలిపారు. 14 రోజుల పాటు ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను సేకరిస్తున్నామన్నారు. సర్వే కోసం వచ్చే ఆశా, ఆరోగ్య సిబ్బందికి ప్రజలు వివరాలు తెలియజేసి సహకరించాలని కోరారు. ఆయన వెంట కుష్టు నివారణ అధికారి గజానంద్, వామన్‌రావ్, సిబ్బంది ఉన్నారు.

● కుష్టు గుర్తింపు ఇంటింటా సర్వే పకడ్బందీగా చేపట్టాలి

**ఇంద్రవెల్లి(ఆంధ్రజ్యోతి):** కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపు ఇంటింటా సర్వేను వైద్య సిబ్బంది పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకుడు డాక్టర్ ప్రదీప్ కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని బుద్దానగర్, ప్రబుద్దానగర్ కాలనీల్లో చేపట్టిన కుష్టు వ్యాధి గుర్తింపు ఇంటింటా సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

## డోర్లి శివారుల్లో అధికారుల పరిశీలన

తలమడుగు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని డోర్లి శివారు ప్రాంతంలో శుక్రవారం ఆంధ్రజ్యోతిలో పెద్దపులి సంచారం.. రైతుల ఆందోళన అనే కథనం ప్రచురితమవడంతో అటవీ శాఖ అధికారులు పర్యటించారు. దీనిలో భాగంగా డోర్లి, కప్పరిదేవి, మందగూడ, తలమడుగు, తదితర శివారు ప్రాంతంలో గల వ్యవసాయ పొలాల్లో పనులు చేస్తున్న రైతులను కలిసి పులి జాడ విషయాలను అడిగి తెలుసుకున్నారు. రైతులు, గ్రామీణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వారికి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పారెస్ట్ సెక్షన్ అధికారి శంకరయ్య, బీట్ అధికారులు అమర్ సింగ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## ఖోడద్‌లో జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

తలమడుగు, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఖోడద్ గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్లో శుక్రవారం ఉమ్మడి జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి ఖోఖో పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రామగుండం ఏఎస్పీ నర్సింలు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కిసాన్ సెల్ ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డిలు హాజరై పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కిసాన్ సేల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం క్రీడారంగానికి పెద్దపీట వేస్తూ గ్రామీణ స్థాయిలో క్రీడలను ప్రోత్సహించడానికి సీఎం కప్ పేరుతో క్రీడా పోటీలను నిర్వహించిందని, రాబోయే రోజుల్లో క్రీడాకారులకు గుర్తింపు వచ్చేలా మరిన్ని కార్యక్రమాలను ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. అనంతరం రామగుండం ఏఎస్పీ నర్సింలు మాట్లాడుతూ తాను కూడా ఖోడద్ ప్రభుత్వ పాఠశాలలో చదివనని, గ్రామీణ స్థాయి నుంచి ఏఎస్పీ స్థాయి వరకు ఎన్నో ఒడిదుడుకులు ఎదుర్కొంటూ ఉన్నత లక్ష్యంతో ముందుకు వచ్చానని, విద్యార్థులు ఒక లక్ష్యం ఏర్పర్చుకొని క్రీడా స్ఫూర్తితో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. క్రీడలతో శారీరకధారుడ్యంతో పాటు మానసికంగా ధృడంగా అవుతారని, క్రీడలు భవిష్యత్తులో విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. క్రీడాకారులకు క్రీడా దుస్తులను బోరంచు శ్రీకాంత్‌రెడ్డి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, జిల్లా ఖోఖో అసోసియేషన్ సెక్రటరీ శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ సాకి ఆనంద్, ట్రైబల్ వెల్ఫేర్ క్రీడా అధికారి పార్థసారథి, బీఆర్ఎస్ పార్టీ బోథ్ అధికార ప్రతినిధి కిరణ్, కబడ్డీ అసోసియేషన్ సెక్రెటరీ రాష్ట్రపాల్, గ్రామ యూత్ ప్రెసిడెంట్ శివకుమార్, వెంకట్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ ఆఫీస్ తరలించే ప్రయత్నం

● పేరుకే ఏసీబీ కార్యాలయం.. ఇన్‌చార్జీలతో నెట్టుకొస్తున్న వైనం



ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని ఏసీబీ కార్యాలయం తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఆదిలాబాద్ ఏసీబీ కార్యాలయం ఉన్నట్లే గానీ ఇక్కడ ఇన్‌చార్జి అధికారులతో నెట్టుకొస్తున్నారు. కరీంనగర్ ఆదిలాబాద్‌కు ఒక్కరే ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నారు. గతంలో ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఈ కార్యాలయం హెడ్ క్వార్టర్‌గా ఉండేది. కానీ జిల్లాలో పెరిగాక రవాణా సౌకర్య సమస్యలతో ఇప్పుడు ఇక్కడ పని చే సేందుకు అధికారులెవరు ఆసక్తి చూపడం లేదు. దీంతో ఇక్కడి కార్యాల యాన్ని మచిర్యాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోం ది. మంచిర్యాలకు కార్యాయలాన్ని తరలిస్తే వరంగల్, కరీంనగర్ ఇతర ప్రాంతాల నుంచి రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండడంతో మంచిర్యాలకు తరలించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలుస్తోంది.

● ఉమ్మడి జిల్లాకు ఒక్కటే ఏసీబీ కార్యాలయం

తెలంగాణ వచ్చాక ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో నాలుగు జిల్లాలుగా విభజించాక.. ఒక్కో జిల్లాలో కలెక్టరేట్ ఏర్పాటు చేశారు. కానీ ఏసీబీ కార్యాలయం మాత్రం ఒకటే ఉంది. దీంతో ఆదిలాబాద్‌కు పోస్టింగ్ అంటేనే అధికారులు రావడానికి ఆసక్తి చూపడం లేదు. అదేవిధంగా నిర్మల్, మంచిర్యాల జిల్లాలో ఏసీబీ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్నాయి. మంచిర్యాల, కొమురంభీం జిల్లాల నుంచి ఫిర్యాదులు ఇచ్చేందుకు కష్టమవుతుందని పలువురు పేర్కొంటున్నారు. కాగా ఏసీబీ కార్యాలయాన్ని ఇక్కడి నుంచి తరలించొద్దని స్థానికులు పేర్కొంటున్నారు.

● ఏసీబీ స్థలం కబ్జాకు యత్నం

ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని కైలాష్‌నగర్ సమీపంలో ఏసీబీ కార్యాలయం క్వార్టర్స్ కోసం ప్రభుత్వం 16 గుంటల భూమిని కేటాయిం చింది. అయితే, ఈ భూమి విలువ కోట్ల రూపాయల్లో ఉంటుంది. కాగా ఈ భూమిని రెండు నెలల క్రితం పలువురు అక్రమించే ప్రయత్నం చేశారు. దీనిపై ఏసీబీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో వారు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## ఎక్సైజ్ శాఖలో టార్గెట్స్ లొల్లి!

(5వ పేజీ తరువాయి...)

పూర్తి చేయడం అంత సులువేమీ కాదన్న వాదనలు వినిపిస్తున్నాయి. బెల్ట్ షాపులకు భారీగా మద్యాన్ని తరలిస్తూ సేల్స్ పెంచుకునేలా వ్యాపారులు ప్లాన్ చేస్తున్నారు. అన్నిరకాల మార్గాలలో సేల్స్‌ను పెంచేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా జిల్లా సరిహద్దుల్లో ఉన్న మహారాష్ట్ర మద్యాన్ని కట్టడి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. అయితే పూర్తిగా ఆదాయం పైననే దృష్టి సారిస్తున్న ఎక్సైజ్ శాఖ.. ప్రజల ఆరోగ్యాన్ని అసలు పట్టించుకోవడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి

## 'గంజాయి అమ్మినా సాగు చేసినా నేరమే'

భీంపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్మిన సాగు చేసిన చట్ట రీత్యా నేరమే అని జైనాథ్ సీఐ సాయినాథ్ అన్నారు. ఆయన భీంపూర్ ఎస్సై మహ్మద్ ఖలీంతో కలిసి మండలంలోని కరణ్ వాడి అనుబంధ గ్రామం అయిన ఇందిర నగర్‌లో జాదవ్ తులసి రామ్ అనే వ్యక్తి గంజాయి అమ్ముతున్నాడన్న పక్క సమాచారంతో తన ఇంట్లో సోదాలు నిర్వహించగా 126 గ్రాముల ఎండు గంజాయి లభించింది. దీని విలువ 33 వేల రూపాయలు ఉంటుందన్నారు. ఇంటి పక్కన ఖాళీ స్థలంలో పెంచుతున్న నాలుగు గంజాయి చెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుని ఎన్‌డీపీఎస్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు సీఐ సాయినాథ్ తెలిపారు. యువకులు గంజాయి మత్తుకు బానిసలు కావద్దని ఈ సందర్భంగా సూచించారు.

## రామాయి టీజీబీలో చోరీకి విఫలయత్నం

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ మండలంలోని రామాయి గ్రామంలో తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో దొంగలు చోరీకి విఫలయత్నం చేశారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... గురువారం రాత్రి బ్యాంక్ వెనక గోడకు పగలకొట్టి చిన్న రంధ్రం చేసి లోనికి వెళ్లేందుకు యత్నించారు. ఈక్రమంలోనే సైరన్ మోగడంతో అక్కడి నుంచి పారిపోయారు. బ్యాంక్ వద్ద చేరుకున్న గ్రామస్తులు గోడకు రంధ్రం వేసి ఉండడాన్ని చూసి బ్యాంక్ సిబ్బందితో పాటు పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని దర్యాప్తు చేస్తున్నారు. బ్యాంక్ మేనేజర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని రూరల్ ఎస్సై ముజాహిద్ తెలిపారు. ఘటన స్థలాన్ని డీఎస్పీ జీవన్ రెడ్డి పరిశీలించారు. బ్యాంకు మేనేజర్ ఫిర్యాదుతో దర్యాప్తు ప్రారంభించారు. అయితే సీసీ కెమెరాలు, మోషన్ డిటెక్షన్ సైరన్‌ల ప్రాధాన్యతను ఇలాంటి ఘటనలు రుజువు చేస్తున్నాయని పోలీసులు చెబుతున్నారు. సైరెన్ మోగడంతోనే దొంగలు అక్కడి నుంచి పారిపోయారన్నారు.

## చోరీ కేసులో దొంగ అరెస్టు

ఆదిలాబాద్ రూరల్, డిసెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జై జవాన్ నగర్‌లో ఈనెల 8న జరిగిన చోరీ కేసును టూ టౌన్ పోలీసుల ఛేదించారు. టూ టౌన్ సీఐ కరుణాకర్ శుక్రవారం పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమానస్పందంగా కనిపించిన ఆయాన్ అనే వ్యక్తిని విచారించగా రూ.15 వేలు, ఒక ఫోన్ దొంగతనం చేసినట్లు అంగీకరించినట్లు తెలిపారు. అతని వద్ద నుంచి రూ.5 వేలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించామన్నారు. ఐడీ పార్టీ సిబ్బంది నరేష్, ప్రవీణ్ పాల్గొన్నారు.

## ప్రారంభమైన మహా పాశుపత యాగం



ఆలయంలో యాగాన్నిప్రారంభిస్తున్న వేద పండితులు

కుంటాల, డిసెంబరు, 13: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కల్లూరు దత్త వెంకటసాయి మందిరంలో శుక్రవారం మహాపాశుపతయాగం ఘనంగా ప్రారంభమైంది. ఈ నెల 7న ప్రారంభమైన ఈ ఉత్సవాలు 15వ తేదీతో ముగియనున్నాయి. శుక్రవారం ప్రారంభమైన యజ్ఞానికి గోవా నుంచి దేశాయ్ గురుజీ మహరాజ్ భైంసాకు చెందిన బబ్రు మహరాజ్ వేద పండితులు పాల్గొని యజ్ఞాన్ని ప్రారంభించారు. ఈ యజ్ఞం ఆదివారం వరకు కొనసాగనుంది. యజ్ఞంలో మండలంలోని ఆయా గ్రామాల నుంచి సతీ సమేతంగా పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి నిర్వాహకులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు చేశారు. ప్రతిరోజు ఉత్సవాలకు వచ్చిన భక్తులందరికీ తాగు నీరు, అన్నదానం తదితర సౌకర్యాలు కల్పిస్తున్నారు.

## క్రీడా పోటీల్లో గెలుపోటములు సహజం



గెలుపొందిన జట్లకు బహుమతి అందిస్తున్న ఎంపీడీవో

పెంబి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : క్రీడా పోటీల్లో గెలుపు, ఓటములు సహజమని ఎంపీడీవో రమాకాంత్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న సీఎం కప్ పోటీలు మండల కేంద్రంలోని ప్రాథమిక ఉన్నత పాఠశాలలో గత మూడు రోజుల నుండి మండల స్థాయి పోటీలు నిర్వహించారు. కబడ్డీ బాలుర విభాగంలో మొదటి బహుమతి పెంబి జట్టు, ద్వితీయ బహుమతి రాంనగర్ జట్టు, వాలీబాల్ బాలుర విభాగంలో మొదటి బహుమతి పెంబి జట్టు, ద్వితీయ బహుమతి కోసగుట్ట, ఖోఖో బాలుర విభాగంలో మొదటి బహుమతి కోసగుట్ట, ద్వితీయ బహుమతి పెంబి జట్టు, ఖోఖో బాలికల విభాగంలో మొదటి బహుమతి పెంబి జట్టు, ద్వితీయ బహుమతి మందపల్లి జట్టు గెలుపొందాయి. గెలుపొందిన జట్లకు ఎంపీడీవో చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో రాంచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు సల్ల స్వప్నిల్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు తులాల శంకర్, పీఈటీ రాము, పంచాయతీ సెక్రటరీ అధ్యక్షులు రాజేందర్, పంచాయతీ సెక్రటరీలు రాంబాబు, రాజు, రాజేశ్వర్, తదితరులు ఉన్నారు.

## పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేత



లోకేశ్వరం, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పుష్పూర్ జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల పదోతరగతి విద్యార్థిని విద్యార్థులకు పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షులు తోట నరేంద్రబాబు స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. విద్యార్థులు అందరూ కష్టపడి చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత అవ్వాలని కోరారు. మన పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తేవాలని కోరారు. జిల్లా అధ్యక్షులు నరేంద్ర బాబుకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులందరి తరపున ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నాం

● లాప్‌టాప్‌లు ఇవ్వలేదు.. భోజనం సరిగ్గా పెట్టడం లేదు ● ఐదేళ్లుగా నిలిచిన యూనిఫామ్స్, షూస్, హాస్టల్ సామాగ్రి సరఫరా ● ఫ్యాకల్టీ లేక చదువుకోలేకపోతున్నాం ● ఆట పరికరాల్లేవు.. ఆడించే వారు లేరు.. ● సమస్యల పరిష్కారం కోసం యూనియన్ ఏర్పాటు చేసుకుంటాం ● జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్కకు సమస్యలతో విద్యార్థుల మొర



బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థుల వింటున్న మంత్రి సీతక్క

బాసర, డిసెంబరు, 13 : (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లుగా లాప్‌టాప్‌లు ఇవ్వడం లేదు... యూనిఫామ్స్, షూస్, పరుపులు వంటి హాస్టల్ వస్తు సామాగ్రి సరఫరాను నిలిపేశారు. నిత్యం అసౌకర్యాలతో అవస్థలు ఎదుర్కొంటున్నాం. పరిష్కరించండి అంటూ బాసర ఆర్జీయూకేటీ విద్యార్థులు జిల్లా ఇన్‌చార్జీ మంత్రి సీతక్క ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బాసర పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీని తొలిసారిగా సందర్శించారు. ముథోల్ ఎమ్మెల్యే రాంరావు పటేల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌తో కలిసి విద్యార్థులతో సమావేశమై వారితో ముఖాముఖిగా మాట్లాడారు. విద్యార్థులు ఒక్కొక్కటిగా సమస్యను మంత్రి దృష్టికి తెచ్చారు. వివిధ విభాగాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధ్యాపకులకు పరిపాలన బాధ్యతలు ఇవ్వడం వల్ల తరగతులు సరిగా జరగడం లేదని చెప్పారు. గత ఐదేళ్ల నుంచి లాప్‌టాప్‌లు ఇవ్వడం లేదని, ఇంజనీరింగ్ కోర్సు పూర్తి చేయడంలో వెనుకబడి పోతున్నామని అన్నారు. 70 శాతం మంది బాలికలు ఉన్న ఈ క్యాంపస్ ఆసుపత్రిలో ఒక్క గైనకాలజిస్ట్ కూడా లేరని ఆరోగ్య సమస్యలను చెప్పుకోలేని పరిస్థితి ఉందని విద్యార్థినులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుండి ఫీజు రీయంబర్స్ మెంట్ కింద స్కాలర్‌షిప్‌లు మంజూరు కాక సర్టిఫికెట్‌లు తీసుకోలేకపోతున్నామని తెలిపారు. ఆట పరికరాల్లేవు. ఆటలాడించే పీటీలు లేరని, అదే విధంగా క్రీడా మైదానాలను పెంచాలని కోరారు. 9 వేల మంది విద్యార్థులు చదువుకుంటున్న ఈ క్యాంపస్‌లో 150 మందికి సరిపడే లైబ్రరీ మాత్రమే ఉందని అందులో పోటీ పరీక్షలకు ప్రిపేర్ అయ్యే విద్యార్థులకు అవసరమైన మెటీరియల్ లేవని చెప్పారు. హాస్టల్‌లో భోజనం సరిగ్గా పెట్టడం లేదని మెస్ కాంట్రాక్టర్‌లను మార్చాలని అన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులందరూ 16 నుంచి 19 సంవత్సరాల వయసు విద్యార్థులే ఉన్నందున ప్రోటీన్ పదార్థాన్ని ప్రతీరోజు అందివ్వాలని విజ్ఞప్తి చేశారు. వసతి గృహాలు ఏర్పాటు చేసి చాలా కాలమైనందున అన్ని వసతులు చెడిపోయాయని వాటికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. ఇవే కాకుండా వైఫై, క్యాంటీన్, అధ్యాపకుల భర్తీ, విద్యార్థుల కమిటీని (ఎస్‌జీసీ) ఏర్పాటు మంత్రి దృష్టికి తెచ్చారు.

**ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దుతాం**

సాక్షాత్తు సరస్వతీ దేవి కొలువై ఉన్న క్షేత్రంలో గల ఆర్జీయూకేటీ ట్రిపుల్ ఐటీని ఉత్తమ విద్యా సంస్థగా తీర్చిదిద్దుతామని విద్యార్థులు చెప్పిన ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) చెప్పారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధనతో పాటు మెరుగైన వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. వివిధ అభివృద్ధి పనుల కోసం రూ.కోటి నిధులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇంత మంది విద్యార్థులను కలవడం ఆనందంగా ఉందని గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రతిభా వంతులైన విద్యార్థులకు అన్ని వసతుల కల్పిస్తామని చెప్పారు. అనంతరం విద్యార్థులతో కలిసి మంత్రితో పాటు జిల్లా అధికారులు, ప్రజా ప్రతినిధులు భోజనం చేశారు. మంత్రి వెంట ఎమ్మెల్యే రాంరావు పటేల్, ఎమ్మెల్సీలు బలుమూరి వెంకట్, దండె విఠల్, జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీ షర్మిల, ఆర్డీవో కోమల్‌రెడ్డి, ఎంఆర్‌వో పవన్‌చంద్ర తదితరులు ఉన్నారు.

# గ్రామాల్లో ధాన్యం దొంగతనం.. ట్రాక్టర్ ట్రాలీలు సైతం

లక్ష్మణచాంద, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో ఆరబోసి సంచులలో నింపి ఉంచిన ధాన్యం దొంగతనం చేస్తున్నారు. తాజాగా తిరుపెల్లి గ్రామానికి చెందిన రైతులు సుంచు ధర్మరాజుకు చెందిన 4 సంచులు (70 కేజీలు), గూండ్ల లింగన్నకు చెందిన 2 సంచులు (40 కేజీలు), భైర గంగాధర్ సంబంధించిన 4 సంచులు (70 కేజీలు) దొంగతనం జరిగాయని శుక్రవారం తెలిసింది. ఈ సంచులను దొంగలు బైక్‌లపై ఎత్తుకెళ్లినట్లు సీసీ కెమెరాలలో రికార్డు కావటం విశేషం. గత నాలుగు రోజుల క్రితం లక్ష్మణచాంద గ్రామానికి చెందిన రైతులు కూన పోశెట్టికి చెందిన 13 సంచులు (70 కేజీలు), ముత్యంకు చెందిన 7 సంచులు (70 కేజీలు) దొంగతనం జరిగాయని రైతులు తెలిపారు. ఇందుకు సంబంధించి స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు కూడా వారు పేర్కొన్నారు. ధాన్యమే కాకుండా గతంలో పీచర గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్ ట్రాలీ, లక్ష్మణచాంద గ్రామానికి చెందిన ఒక ట్రాక్టర్ ట్రాలీని, ఒక రోటవేటర్ ఎత్తుకెళ్లినట్లు స్థానికులు పేర్కొన్నారు. ఆయా గ్రామాల్లోని ఆలయంలో కూడా హుండీలు పగులగొట్టి డబ్బులు ఎత్తుకెళ్లిన సంఘటనలు, ఏకంగా హుండీలు సహితం మాయమైన సంఘటనలు మండల ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నట్లు పలువురు అభిప్రాయపడ్డారు. పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకొని దొంగతనాలను నివారించాలని వారు కోరుతున్నారు.

**దొంగతనాలు జరుగకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి**

దొంగతనాలు జరుగకుండా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. తిరుపెల్లిలో ధాన్యం చోరీ జరగడం మూడోసారి. ధాన్యం దొంగిలించిన దొంగలను పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకొని రైతులకు న్యాయం చేయాలి.

**కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం : ఎస్సై సుమలత**

రైతులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం. పోలీసుల నిఘా పెంచుతాం. ట్రాలీలు దొంగిలించినట్లు నాకు ఫిర్యాదు అందలేదు. అన్ని గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. అప్పుడే నేరాల నివారణకు అవకాశం ఉంటుంది.

## వైద్యులను సన్మానించిన గంగపుత్ర సంఘం

దిలావర్‌పూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : న్యాలోలం గ్రామానికి చెందిన ఇద్దరు యువతులు వైద్యవిద్యను చదివి కొత్తగా ప్రభుత్వ వైద్యులుగా నియమితులయ్యారు. గ్రామానికి చెందిన డాక్టర్ వెల్మల ప్రియాంక, డాక్టర్ అరుగుల శైలజలను గంగపుత్రసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. తమ గ్రామానికి చెందిన మధ్యతరగతి కుటుంబాలకు చెందిన ఇద్దరు వైద్యవైద్యను అభ్యసించి ప్రభుత్వ వైద్యులుగా నియామకం కావడం మా గ్రామానికి, మాకు గర్వకారణంగా ఉందని కొనియాడారు.

## కొలువు సాధించిన విద్యార్థికి గ్రామస్థుల సత్కారం

నర్సాపూర్(జి), డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : తురాటి గ్రామానికి చెందిన ముజ్జి సాయన్న - సుశీలల కూతురు ముజ్జి స్రవంతి నిరుపేద కుటుంబంలో జన్మించింది. చిన్న వయసులోనే తండ్రి మరణించడంతో అనేక కష్టాలు ఎదుర్కొంది. స్రవంతి అన్నయ్య చెల్లి విజయానికి కృషి చేశాడు. పాఠశాల తరుపున ప్రధానోపాధ్యాయులు ఎస్. లస్మన్న, గ్రామం తరుపున కండెల రాములు, బి. శ్యామ్, బి. సతీష్ కుమార్, పి. వేణు, ఎస్. సురేష్‌లు సత్కారం చేశాడు.

## పెంబిలో ఎక్సైజ్ అధికారులు మెరుపు దాడులు



స్వాధీనం చేసుకున్న బెల్లంతో ఎక్సైజ్ అధికారులు

పెంబి, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెంబి తండా, ఇటిక్యాల్, ఇటిక్యాల్ తండా గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు శుక్రవారం మెరుపు దాడులు నిర్వహిచారు. ఈ సందర్భంగా ఎక్సైజ్ ఎస్సై వసంత్‌రావు మాట్లాడుతూ.. ఎక్సైజ్ సూపరిండెంట్ రజక్ ఆదేశాల మేరకు దాడులు నిర్వహించడం జరిగిందని, ఈ దాడుల్లో 5 లీటర్ల గుడుంబా, 320 కేజీల నల్ల బెల్లం, 35 కేజీల పటిక, 200ల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. నాటుసారా తయారు చేసిన, నల్ల బెల్లం, పటిక అమ్మిన కఠినచర్యలు తప్పవన్నారు. ఎవరైనా అమ్మిన, తయారు చేసిన ఎక్సైజ్ అధికారులను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఏసీ ఇన్ఫర్మేంట్ సీఐ అక్బర్‌హుస్సేన్, ఎస్సై సింధు, గజేందర్, సిబ్బంది వెంకటేష్, రవీందర్, గౌతమ్, కల్పన, తేజ, తదితరులు ఉన్నారు.

## బీడీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని బీడీ కార్మికుల సమస్యలు పట్టించుకోవాలని సీపీఎం డిమాండ్ చేసింది. పీఎఫ్ లేనివారికి హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, ఈఎస్సై హాస్పిటల్‌కు సొంత భవనం నిర్మించాలని, మందులు సరఫరా చేయాలన్నారు. నాయకులు పోశెట్టి, శంభు, ఫసియుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.

## ఎడ్‌బిడ్‌లో బోదకాలు వ్యాధిగ్రస్తుల గుర్తింపు

ముథోల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో గురువారం రాత్రి సంబంధిత వైద్యాధికారులు ఇంటింటికి తిరిగి బోదకాలు వ్యాధిగ్రస్తుల గుర్తింపుకై రక్త పూతల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర పరిశీలకులు డా. లక్ష్మణ్, మెడికల్ ఆఫీసర్ డా. ఆకాష్, హెచ్‌ఈవో వేణుగోపాల్ రావు, ఎల్‌టీ వెంకటేశ్వర్, గంగారాం, ప్రాథమిక ఆరోగ్య కేంద్ర మహిళా ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మొక్కజొన్నలో అధిక యూరియా వాడకాన్ని తగ్గించాలి

సోన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సిద్ధిలకుంట గ్రామంలో పలు మొక్కజొన్న క్షేత్రాలను మండల వ్యవసాయ అధికారి వినోద్‌కుమార్ పరిశీలించడం జరిగింది. మొక్కజొన్న పంటలో వాడాల్సిన మోతాదుకు మించి అధికంగా యూరియాను వాడుతున్నారని తెలిపారు. ఒక ఎకరానికి మొక్కజొన్న పంటలో 4 బస్తాల యూరియా సరిపోతుందన్నారు. అలాగే రైతులు నానో యూరియాను వాడడం వల్ల అధిక దిగుబడులు సాధించవచ్చునని తెలిపారు. అలాగే మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు ఇమామెక్టిన్ బెంజోయేట్ 80 గ్రాములు ఒక ఎకరానికి పిచికారి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు నందురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## తప్పిదాలు లేకుండా సర్వే నిర్వహించండి

కుభీర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామాల్లో చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక సర్వే తప్పిదాలు లేకుండా నిర్వహించాలని ఎంపీడీవో నవనీత్‌కుమార్ అన్నారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల ఎంపిక సర్వేపై మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీవో మోహన్‌సింగ్ మాట్లాడుతూ ఇళ్ల ఎంపికకు మీరు చేపడుతున్న సర్వేనే ప్రామాణికమని తప్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారుల ఇంటి వద్ద సర్వే యాప్‌లో నమోదు చేయాల్సిన వివరాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో హరిలాల్, మండల పంచాయతీ కార్యదర్శులు ఈజీఎస్ టీఏలు, ఎఫ్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

# రాజకీయ రొంపిలో 'ఇందిరమ్మ' కమిటీలు!

● లబ్ధిదారుల గుర్తింపులో తీవ్ర జాప్యం ● రంగంలోకి అధికారులు




బోథ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఆయా గ్రామాల్లో అధికారులు, ఇందిరమ్మ గ్రామ కమిటీల వారు అర్హులైన వారిని గుర్తిస్తున్నారు. అయితే ఆదిలాబాద్ జిల్లాలోని బోథ్ నియోజకవర్గంలో మాత్రం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితా సిద్ధం చేయడంలో తీవ్ర జాప్యం జరిగేట్లు కనిపిస్తోంది. నియోజకవర్గ పరిధిలో ఆయా గ్రామాలలో ఇందిరమ్మ గ్రామ కమిటీల ఏర్పాటు విషయంలో రాజకీయాలు చోటుచేసుకున్నాయి. దీంతో గ్రామ కమిటీల జాబితా సిద్ధం చేయడం అధికారులకు తలనొప్పిగా మారింది.

### ● అన్నింటా రాజకీయమే

ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలు చేసే క్రమంలో ప్రతీచోట రాజకీయం చోటుచేసుకుంటున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా అభివృద్ధి సంక్షేమ పథకాలు నియోజకవర్గ ప్రజలకు అందని ద్రాక్షగా మారే ఆస్కారం ఉందని ప్రజల ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. రాష్ట్రవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే స్థానికంగా మాత్రం బీఆర్ఎస్ పార్టీ నుంచి జాదవ్అనిల్ ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో అధికారంలో ఒకరు ఉంటే ప్రతిపక్షంలో మరొకరు ఉన్నారు. అయితే అధికారపార్టీ వారు ఇందిరమ్మ కమిటీలను సిద్ధం చేసి అధికారులకు పంపితే.. బీఆర్ఎస్ కార్యకర్తలు గ్రామాల నుంచి మరో జాబితా సిద్ధం చేసి ఎమ్మెల్యేకు అందించారు. దీంతో అధికారులు జాబితా సిద్ధం చేయడంపై మల్లగుల్లాలు పడ్డారు. చివరకు ఒక అడుగు వెనుక వేసి స్థానిక శాసనసభ్యులు ఇందిరమ్మ కమిటీలో గ్రామానికి ఒకరు చొప్పున బీఆర్ఎస్ నాయకుల పేరును ప్రతిపాదించినట్లు సమాచారం. దీంతో జాబితా సిద్ధం అవుతుందని అందరూ భావించారు. కానీ ఇక్కడ సహితం రాజకీయ కొర్రీలు పెట్టక తప్పలేదు. ఇందిరమ్మ కమిటీలలో అధికార పార్టీకి చెందిన వారే ఉండాలని ఆ పార్టీ నాయకులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో పంచాయితీ రోజుకో మలుపు తిరుగుతోంది.

### ● అధికారులే గుర్తిస్తారా!?

రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ లబ్ధిదారులను ఆయా గ్రామాల కమిటీల వారు గుర్తిస్తుండగా బోథ్ నియోజకవర్గంలో మాత్రం ఇందిరమ్మ లబ్ధిదారుల గుర్తింపు ప్రక్రియను అధికారులే చేపట్టనున్నారు. 13,055 మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే మొదటి విడతలో అధికారులే లబ్ధిదారులను గుర్తించే ఆస్కారం ఉంది. కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు జాబితాను నిలిపివేయాలంటూ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దృష్టికి తీసుకెళ్లడంతో లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ అధికారులకు అప్పగించే ఆస్కారం ఉందని అంటున్నారు.

### ● అధికారుల ఆవేదన

నియోజకవర్గంలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రతీ సంక్షేమ పథకంలో రాజకీయం చోటు చేస్తుందని అధికారులు ఆవేదన వ్యక్తపరుస్తున్నారు. తాము నిష్పక్షపాతంగా పనిచేస్తున్నా.. కొంతమంది రాజకీయపరంగా అధికారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని వాపోతున్నారు. తాము ఇక్కడ పనిచేసే బదులు వేరే చోటికి బదిలీ చేసుకుంటే బాగుంటుందన్న ఆలోచనలో వారు ఉన్నారు.

మెస్‌చార్జీల పెంపుపై..

# నేడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో సంబురాలు




● చార్జీల పెంపుపై నేడు రెసిడెన్షియల్ పాఠశాలల్లో సంబురాలు ● వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు ● ప్రదర్శనల కోసం సిద్ధమైన ఆహార పదార్థాల పట్టికలు ● విద్యార్థుల తల్లితండ్రులకు సహపంక్తి భోజనాలు ● హాజరు కానున్న ప్రముఖులు, పలువురు నాయకులు

**పెరిగిన చార్జి వివరాలు**

| తరగతులు | గత ఛార్జీలు | పెరిగిన ఛార్జీలు |
|---|---|---|
| 3-7 | రూ. 950 | రూ. 1,330 |
| 8-10 | రూ. 1,100 | రూ. 1,540 |
| ఇంటర్ ఆపైన | రూ. 1,500 | రూ. 2,100 |

**కాస్మెటిక్ చార్జీల (బాలికలు) వివరాలు**

| తరగతులు | గత ఛార్జీలు | పెరిగిన ఛార్జీలు |
|---|---|---|
| 3-7 | రూ. 55 | రూ. 175 |
| 8-10 | రూ. 75 | రూ.275 |

**కాస్మెటిక్ చార్జీల (బాలురు) వివరాలు**

| తరగతులు | గత ఛార్జీలు | పెరిగిన ఛార్జీలు |
|---|---|---|
| 3-7 | రూ. 62 | రూ. 150 |
| 8-10 | రూ. 62 | రూ.200 |


భోజనాలు చేస్తున్న విద్యార్థులు

భైంసా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో పెంచిన మెస్‌చార్జీలపై శనివారం సంబరాలు జరుగనున్నాయి. విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల మెస్‌చార్జీలతో పాటు కాస్మెటిక్ చార్జీలను పెంచింది. ఈనేపథ్యంలో శనివారం రెసిడెన్షిల్ పాఠశాలలు, వసతిగృహాల్లో సంబంధిత విషయంలో సంబరాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఇందులో భాగంగానే ఆయా ప్రాంతాల్లోని రెసిడెన్షియల్ పాఠశాలలకు ప్రముఖులను, విద్యార్థుల తల్లితండ్రులను ఆహ్వానించనున్నారు. వారందరి సమక్షంలో రోజువారీగా అందించే పదార్థాల పట్టికను ఈ సంబరాల్లో ప్రదర్శించనున్నారు. విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణంలో నాణ్యమైన పదార్థాలతో రుచిగా, శుచిగా ఆహారాన్ని వండి వడ్డిస్తున్నారని అవగాహన కల్పించనున్నారు. ప్రతీ ఆదివారం మెనూలో విద్యార్థులకు ప్రత్యేకంగా కోడిమాంసంతో వండి వడ్డించే ఆహారాన్నే ఆ రోజు పాల్గొన్న ప్రముఖులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు విందు భోజనంగా పెట్టనున్నారు.

### వేడుకలు ఇలా..

- ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 వరకు మంత్రి/ఎంపీ/ఎమ్మెల్యే/ఎమ్మెల్సీ/కలెక్టర్/ఎస్పీ/కమిషనర్ తదితర ప్రముఖులు సందర్శించి తనిఖీ నిర్వహిస్తారు.
- మధ్యాహ్నం 12 నుంచి 12.30 సాంస్కృతిక కార్యక్రమం, విద్యార్థులతో ముఖాముఖి.
- మధ్యాహ్నం ఒంటి గంటకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కలిసి ప్రముఖుల సహపంక్తి భోజనం.

### ● పెరిగిన డైట్ చార్జీలు ఇలా..

సంక్షేమ వసతి గృహాల్లో డైట్‌చార్జీలు చివరిసారిగా 2017 సంవత్సరంలో పెరిగాయి. ఆ తర్వాత నిత్యావసర వస్తువుల ధరలు బాగా పెరిగాయి. కొన్నింటి ధరలు రెట్టింపయ్యాయి. విద్యార్థులకు డైట్ చార్జీలు పెంచేందుకు ఉన్నతాధికారుల కమిటీ గత ఏడు సంవత్సరాలుగా 20 రకాల నిత్యావసర వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరుగుదల విషయాలను పరిగణనలోకి తీసుకుంది. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలోని నవోదయ విద్యాలయాల్లో డైట్ కోసం చేస్తున్న ఖర్చును పరిశీలించింది. డైట్‌చార్జీలు కనీసం 40శాతం పెంచితేనే ఎన్ఐఎస్ సూచించిన విధంగా నాణ్యమైన పౌష్టికాహారం అందించవచ్చునని అధికారుల కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఇందుకు అనుగుణంగానే రేవంత్‌రెడ్డి సారథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వ డైట్‌చార్జీలను అమోదించి పెంచింది. ఇందులో భాగంగానే 3 నుంచి 7వ తరగతి విద్యార్థులకు రోజుకు రూ.44.33 చొప్పున, 8 నుంచి 10వ తరగతి విద్యార్థులకు రూ.51.33 చొప్పున, ఇంటర్ ఆపై విద్యార్థులకు రోజుకు రూ.70 చొప్పున ఖర్చు చేయనున్నారు.

### ● 16 ఏళ్ల తర్వాత పెరిగిన కాస్మెటిక్ చార్జీలు

వసతి గృహాల్లోని విద్యార్థులకు వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ, పరిశుభ్రత కోసం కాస్మెటిక్ చార్జీలను ప్రభుత్వం చెల్లిస్తోంది. 2008 సంవత్సరం నుంచి సంబంధిత చార్జీలు పెరగలేదు. సంక్షేమ శాఖలు పలుమార్లు విజ్ఞప్తులు చేసినా ప్రయోజనం లేకుండా పోయింది. అరకొరగా అందించే కాస్మెటిక్ చార్జీల విడుదలలో కూడా జాప్యం జరిగేది. కొన్నిసార్లు ఏడాది పాటు అందని పరిస్థితి ఉండేది. 8,9,10 తరగతుల బాలికలకు నెలకు రూ.75తో సర్దుకుపోవాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థుల అవస్థలు, పరిస్థితులను గమనించిన ఉన్నతాధికారుల కమిటీ చార్జీలు పెంచేందుకు గాను ప్రతిపాదించింది. విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే ఆరోగ్యంగా ఉంటారని పేర్కొంటూ కాస్మెటిక్ చార్జీలను 16 ఏళ్ల తర్వాత పెంచారు. పెరిగిన చార్జీలప్రకారం 3వ తరగతి నుంచి 7వ తరగతి బాలికలకు రూ.175 చొప్పున, 8 నుంచి 10వ తరగతి బాలికలకు రూ.275, ఇక 3 నుంచి 7 తరగతి బాలురకు రూ.150 చొప్పున, 8 నుంచి 10 తరగతి బాలురకు రూ.200 చొప్పున చెల్లించనున్నారు.

నిర్మించిన మూడేళ్లకు.. ప్రారంభోత్సవానికి

## సిద్ధమైన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం


ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయం

బోథ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో గత మూడేళ్ల క్రితం నిర్మించిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని శనివారం మంత్రి సీతక్క ప్రారంభించనున్నారు. నిర్మించిన మూడేళ్లకు ప్రారంభానికి నోచుకుంటున్న ఈ భవనానికి రెండుసార్లు మరమ్మతులు సైతం చేపట్టారు. ప్రారంభానికి మొదలు పగుళ్లుతేలిన భవనానికి మూడేళ్ల కాలంలో రెండుసార్లు మరమ్మతులు చేపట్టారు. ప్రతీసారి ప్రారంభోత్సవాలకు మొదలు పగుళ్లు తేలినచోట మరమ్మతులు చేస్తున్నారు. అయితే అద్దెభవనంలో నడుస్తున్న ఈ భవనంలోకి సిబ్బంది సైతం చేరేందుకు ఆసక్తి కనబరచకపోవడంతో భవనంపై దృష్టి పెట్టకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారింది. మారుమూలన ఉన్న రిజిస్ట్రార్ కార్యాలయాన్ని నూతన భవనంలోకి మార్చేందుకు సిబ్బందిసైతం ఇష్టపడక పోవడంతో కార్యాలయం ఇంతవరకు అద్దె భవనంలోని కొనసాగింది. ఇక నుంచి అయినా కొత్త భవనంలో సిబ్బంది విధులు నిర్వహిస్తే వివిధ పనులపై వచ్చే వారికి భవనం అందుబాటులో ఉంటుంది.

## పడకేసిన పారిశుధ్యం!

● అస్తవ్యస్తంగా మురికి కాలువలు

తాంసి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తాంసి మండలంలో పారిశుధ్యం పడకేసింది. మురికి కాలువలు ఎక్కడికక్కడ నిండిపోవడంతో దుర్గంధంగా వెదజల్లుతోంది. ప్రతీ వారం, పది రోజులకు ఒకసారి మురికి కాల్వలను శుభ్రం చేయాల్సి ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టడం లేదన్న ఆరోపణలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. తాంసి మండలంలోని చాలా గ్రామాలలో ఇదే సమస్య కనిపిస్తుంది. మండల కేంద్రమైన తాంసిలో సైతం మురికి కాలువలు అపరిశుభ్రంగా దర్శనమిస్తున్నాయి. దీంతో దోమల తీవ్రత పెరుగుతోంది. దోమల ద్వారా వ్యాప్తిచెందే వ్యాధులు ఇప్పటికే ప్రజలను వెంటాడుతున్నాయని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో స్థానిక కార్యదర్శులు గాని ప్రత్యేక అధికారులు కానీ పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఇకనైనా మురికి కాలువలను శుభ్రం చేసే పనులు చేపట్టాలని మండల వాసులు కోరుతున్నారు.

ఫొటో న్యూస్


మురికి కాలువలో మొలిచిన పిచ్చిమొక్కలు


చెత్తతో నిండి ఉన్న మురికి నీల్వ


అఖండ సాయినామ పారాయణం చేస్తున్న భజన మండలి

## అఖండ సాయినామ పారాయణం ప్రారంభం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : దత్త జయంతి సందర్భంగా నిర్మల్ పట్టణంలోని గండిరామన్న ఆలయంలో శుక్రవారం అఖండ సాయినామ పారాయణాన్ని సాయి దీక్ష సేవా సమితి అధ్యక్షుడు లక్కడి జగన్మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. 48 గంటలపాటు జరిగే సాయినామ పారాయణంలో భక్తులు పాల్గొనాలని కోరారు. ప్రధాన వీధులగుండా శనివారం ఉదయం 9గంటలకు సాయిరథం ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మహిళలు మంగళహారతులతో పెద్ద సంఖ్యలో పాల్గొని బాబా కృపకు పాత్రులు కావాలని కోరారు. బురాజ్, శంకర్, నందు, జిందం గోవర్ధన్, ప్రకాష్ గౌడ్, తదితర భక్తజనం హాజరయ్యారు. సాయినామ పారాయణం తొలిరోజు వెంకటాపూర్, చించాల, కామోల్, ఎడ్‌బిడ్ తండాలకు చెందిన భజన మండళ్లు పాల్గొన్నారు.

## 'సమస్యల పరిష్కారం కోసం చర్యలు'

ఆదిలాబాద్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం చర్యలు తీసుకోవడం జరుగుతుందని విద్యుత్ వినియోగదారుల హక్కుల ఫోరం చైర్‌పర్సన్ ఎరుకల నారాయణ అన్నారు. శుక్రవారం ఆదిలాబాద్ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో ఆదిలాబాద్, దస్నాపూర్, మావల, ఆదిలాబాద్‌రూరల్ ప్రాంతాల విద్యుత్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహించారు. లూస్‌వైర్లు, అదనపు స్తంభాల ఏర్పాటు, విద్యుత్ బిల్లుల తప్పిదాలకు సంబంధించి 10 అర్జీలు రాగా అందులో నాలుగింటిని అప్పటికప్పుడే పరిష్కరించారు. ఈ సందర్భంగా ఎరుకల నారాయణ మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల సమస్యలను తెలుసుకుంటూ వాటి పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఫిర్యాదుల విభాగాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వివిధ సమస్యలపై పది అర్జీలు వచ్చాయని చెప్పారు. కార్యక్రమంలో ఫోరం సభ్యులు రామకృష్ణ, కిషన్లతో పాటు విద్యుత్ శాఖ ఎస్ఈ జేఆర్‌చౌహాన్ తదితరులున్నారు.

బోదకాలు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం

# జిల్లావ్యాప్తంగా వైద్య ఆరోగ్యశాఖ సర్వే

● ఎంపికచేసిన 18 గ్రామాల్లో ఇంటింటా సర్వే ● 5,400మంది రక్త నమూనాల సేకరణ


రక్త నమూనాలను సేకరిస్తున్న ఆరోగ్య కార్యకర్తలు


వివరాలు నమోదు చేస్తున్న ఆరోగ్య కార్యకర్తలు

భైంసా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోదకాలు వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు వైద్య, ఆరోగ్యశాఖ గురువారం రాత్రి జ్వర సర్వే తరహాలో ఫైలేరియా సర్వే చేపట్టింది. జిల్లాప్రోగ్రాం ఇన్‌చార్జి డా.రవీందర్‌రెడ్డి నేతృత్వంలో ఒకరోజు వ్యవధిలో వైద్య, ఆరోగ్యశాఖ జిల్లావ్యాప్తంగా సర్వే నిర్వహించింది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన 18 గ్రామాల్లో వైద్యఆరోగ్యశాఖ బృందాలు ఇంటింటా బోదకాలు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం సర్వే చేపట్టింది. ఒక్కో గ్రామంలో 300చొప్పున జిల్లావ్యాప్తంగా మొత్తం 5,400మంది నుంచి రక్త నమునాలను సేకరించారు. సంబంధిత రక్త నమునాలను పరీక్షల నిమిత్తం హైదరాబాద్‌కు పంపించనున్నారు. పరీక్షఫలితాల్లో బోదకాలు వ్యాధిగ్రస్తులుగా తేలిన బాధితులకు ప్రభుత్వం తరపున వ్యాధి నివారణ మందులను పంపిణీ చేయనున్నారు.

### ● ఒక్కో పీహెచ్‌సీ పరిధిలో ఒక్కో గ్రామం

వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం జిల్లాలోని 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఒక్కో గ్రామాన్ని ఎంపిక చేసి వైద్య ఆరోగ్యశాఖ సర్వే చేపట్టింది. రామ్‌నగర్, మంజులాపూర్, చించోలి, కోరిటికల్, లక్ష్మణ్‌చాంద, కనకపూర్, కుంటాల, దిలావార్‌పూర్, గడ్‌చాంద, తిమ్మాపూర్, లింగాపూర్, బూత్కూర్, దేగాం, ఎడ్‌బిడ్, సిద్ధార్థనగర్, కుభీర్, బోసి, చొండి గ్రామాల్లో సర్వే నిర్వహించారు. ఒక్కో గ్రామంలో వైద్య ఆరోగ్యశాఖకు చెందిన 6 బృందాలు సర్వేలో పాల్గొన్నాయి.

### ● రాత్రి వేళలో రక్త నమునాల సేకరణ


అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారుల బృందం

ఎంపిక చేసిన గ్రామాల్లో వైద్య, ఆరోగ్యశాఖ అధికారులు, సిబ్బంది గురువారం రాత్రి 9గంటల నుంచి 12గంటల వరకు సర్వే చేపట్టారు. ఒక్కో గ్రామం నుంచి 300 చొప్పున మొత్తం 18 గ్రామాల నుంచి మొత్తం 5,400 మంది నుంచి సర్వేలో భాగంగా రక్త నమునాలు సేకరించారు. రాత్రివేళలో మైక్రో ఫైలేరియా క్రిమి బాధితుల రక్తనాళల్లో ఉంటుందనే కారణంతో వైద్య ఆరోగ్యశాఖ రాత్రి వేళలో సర్వే చేపట్టినట్లుగా తెలిసింది.

### ● జిల్లాలో 1,474 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులు

వైద్య, ఆరోగ్య శాఖ ప్రతీయేటా బోదకాలు వ్యాధిగ్రస్తుల గుర్తింపు కోసం సర్వే చేపట్టింది. గతకొంత కాలంగా నిర్వహించిన సర్వేలో జిల్లాలో 1474 మంది బోదకాలు వ్యాధిగ్రస్తులు ఉన్నట్లుగా తేలింది. వారందరికి వైద్యఆరోగ్యశాఖ వ్యాధ నివారణ కోసం మందులను అందచేస్తోంది.

మంత్రిగారూ బోథ్

# సమస్యలు పరిష్కరించరూ!

బోథ్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో శనివారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటించనున్నారు. అయితే గత ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచార సభలో బోథ్ మండల ప్రజలకు ఇచ్చిన హామీలు ఇంతవరకు ఏ ఒక్కటీ రూపు దాల్చలేదు. దీంతో మండల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం పరుస్తున్నారు. బోథ్ నియోజకవర్గ కేంద్రాన్ని రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటుచేస్తామని ఇచ్చారు. దాదాపు 3 నెలల కాలం పాటు రెవెన్యూ డివిజన్ ఏర్పాటు కోసం మండల ప్రజలు దశలవారీగా రిలేనిరాహార దీక్షలు చేపట్టారు. దీంతో సమస్యను గుర్తించిన రాజకీయపార్టీల వారు రెవెన్యూ డివిజన్‌ఏర్పాటు చేస్తామంటూ హామీలు ఇచ్చారు. సీఎం సైతం హామీ ఇచ్చిన ఒక్క అడుగు కూడా ముందుకు కదలడం లేదు.

### ● ఫైర్ స్టేషన్, డిగ్రీ కళాశాల కలగానే..

నియోజకవర్గ కేంద్రంలో ప్రతీ ఏడాది అగ్ని ప్రమాదాలతో లక్షల రూపాయల ప్రజల ఆస్తులు ఖాళీ బూడిద అవుతున్నాయి. అయితే ప్రతీ ఏడాది కాలంలో మండల ప్రజలు ఫైర్ స్టేషన్ గురించి ఆందోళన చేస్తున్నారు. ఫైర్ స్టేషన్ ఏర్పాటు గురించి గత ప్రభుత్వ హయాంలోని ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఆయన నేటికీ రూపు దాల్చలేదు. ఎన్నికల సందర్భంగా ఇప్పటి ముఖ్యమంత్రి సైతం ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేస్తామని పేర్కొన్న దీని ఊసే లేదు. ఇక నిరుపేద పిల్లలకు ఉన్నత చదువుల కోసం డిగ్రీ కళాశాల లేకపోవడంతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో ఆశ్రయించాల్సి వస్తోంది. అయితే చదువులను కొనుక్కోలేని పేదలు ఉన్నత చదువులకు దూరమవుతున్నారు. ఇకనైనా స్థానికంగా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించేందుకు మంత్రి కృషి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

### ● క్రీడా మైదానం లేక..

గత రెండున్నర సంవత్సరాల కాలంగా క్రీడా మైదానాన్ని ఏర్పాటు చేస్తామంటూ ఎన్నికల బరిలో ఉన్న ప్రతీ నాయకుడు స్థానిక యువతకు హామీలు ఇస్తూ వస్తున్నారు. అయితే క్రీడామైదానం కలగానే మిగిలిపోతున్నది. దీంతో నిరుపేద విద్యార్థులకు క్రీడలలో ప్రావీణ్యం లేకపోగా శారీరక ఎదుగుదల లేకపోవడంతో కనీసం కానిస్టేబుల్ ఉద్యోగాలను సైతం సాధించుకోలేకపోతున్నారు. అంతేగాక పై చదువుల నిమిత్తం అవసరమైన గ్రంథాలయం సైతం భవన నిర్మాణానికి నోచుకోకపోవడంతో విద్యార్థులకు పుస్తక పఠనానికి సరైన స్థలం లేక ఇతర ప్రాంతాల్లోని కోచింగ్ సెంటర్లకు తరలివెళ్తున్నారు. ఆర్థికస్తోమత లేనివారు గ్రామాలకే పరిమితమవుతున్నారు.

### ● పాలకులు మంత్రికి సమస్యలను విన్నవిస్తారా?

నియోజకవర్గ కేంద్రంలో నెలకొన్న సమస్యలను రాష్ట్ర మంత్రి దృష్టికి స్థానిక నాయకులు తీసుకు వెళ్లాల్సిన అవసరం ఉంది. మంత్రి అధికారికంగా పర్యటిస్తున్న సందర్భంలో సమస్యలను విన్నవిస్తే వీటిలో కొన్నింటిని పరిష్కార మార్గం లభించే ఆస్కారం ఉందని స్థానికులు అంటున్నారు. లేకుంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారపార్టీకి చుక్కెదురు అవుతుందని రాజకీయవిశ్లేషకులు అంటున్నారు.

### ఆందోళనకు సిద్ధమవుతున్న రైతులు

రెండు లక్షలకు పైనున్న బ్యాంకు రుణాలు మాఫీ కానీ రైతులు మంత్రి సీతక్క పర్యటన సందర్భంగా ఆందోళనకు సిద్ధమవుతున్నారు. వివిధ కారణాల వల్ల తమకు రుణమాఫీ కాలేదని బ్యాంకుల చుట్టూ రైతులు వందల సంఖ్యలో చక్కర్లు కొడుతున్నారు. అయితే నేడు శనివారం మంత్రి మండల కేంద్రానికి వస్తున్న నేపథ్యంలో రైతులు ఆందోళనకు సిద్ధమవుతున్నారు. మరోవైపు స్థానికంగా ఉన్న ప్రతిపక్ష నాయకులు సైతం ఈ విషయంలో రైతాంగానికి అండగా నిలుస్తుండడంతో మంత్రికి రైతుల నుండి నిరసన సెగ తగిలే ఆస్కారం ఉందని పరిశీలకులు అంటున్నారు. విషయాన్ని పసిగట్టిన పోలీసులు సహితం నిరసన కారులపై ఒకన్నేసి ఉంచారు.





# పశువుల లెక్క ఇక పక్కా

- జిల్లాలో కొనసాగుతున్న పశుగణన
- సోషియో ఎకనామిక్ సర్వే తరహాలో నిర్వహణ
- 488 గ్రామాలకు గాను 289 గ్రామాల్లో మొదలైన సర్వే



పశుగణన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ అభిలాష అభినవ్ (ఫైల్)

నిర్మల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ వైపు ప్రభుత్వం సమగ్ర కుటుంబ సర్వే కొనసాగిస్తూ మొత్తం జనాల లెక్కను నిగ్గు తెల్చేందుకు ప్రయత్నిస్తూనే మరోవైపు జిల్లాలో ఉన్న మొత్తం పశువుల సంఖ్యను కూడా లెక్కించేందుకు నడుం బిగించింది. ఇందులో భాగంగానే అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని అక్టోబరు 25న రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభించింది. ఈ పశుగణన కార్యక్రమం ఫిబ్రవరి 28, 2025 వరకు కొనసాగనుంది. దీని కోసం గాను జిల్లాలోని అన్ని రకాల పశువుల సంఖ్యను లెక్కించేందుకు మొత్తం 82 మంది ఎన్యూమరేటర్లను పశు వైద్యారోగ్యశాఖ నియమించింది. ఎన్యూమరేటర్ల పనితీరును అలాగే లెక్కల గణనను పర్యవేక్షించేందుకు 21 మంది సూపర్‌వైజర్‌లను నియమించారు. జిల్లాలో మొత్తం 488 గ్రామాలను పశుగణన కోసం పరిగణలోకి తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు 289 గ్రామాల్లో పశుగణన కార్యక్రమం ప్రారంభమైంది. ఇంకా 199 గ్రామాల్లో పశుగణన సర్వే చేపట్టాల్సి ఉంది. ప్రతి ఐదు సంవత్సరాలకు ఒకసారి కేంద్ర ప్రభుత్వం ఈ పశుగణన కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తోంది. అందులో భాగంగానే ఈ సారి కూడా సర్వేను పకడ్బందీగా చేపట్టేందుకు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలో ప్రాథమిక లెక్కల ప్రకారం 2.21.850 పశువులున్నట్లుగా పేర్కొంటున్నారు. దీని కోసం గాను మొత్తం జిల్లాలో 47 పశువైద్యశాలలు కూడా కొనసాగుతున్నాయి. ఈ పశువులశాలలో వైద్యాధికారులు పశువులకు ఆరోగ్యసేవలు అందిస్తున్నారు. కాగా పశువైద్యశాఖ సిబ్బంది నిర్వహిస్తున్న ఈ సర్వే ద్వారా మొత్తం ఒక్కో ఇంట్లో పశువులు, గొర్రెలు, కుక్కలు ఇతర పశువులు ఎంతసంఖ్యలో ఉన్నాయనే అంశం వెల్లడికానుంది. ప్రతీ ఇంటికి వెళ్లి సర్వే చేపడుతున్నారు.

### సర్వేతో పశు సంపద నిర్ధారణ..

కాగా జిల్లావ్యాప్తంగా గత ఐదు సంవత్సరాల కన్నా నాలుగింతలుగా పశు సంపద పెరిగినట్లు చెబుతున్నారు. ప్రభుత్వాలు నిరుద్యోగులకు ఉపాది అవకాశాలు కల్పించేందుకు గానూ సబ్సిడీలు అందిస్తుండడం అలాగే బ్యాంకులు సైతం రుణాలు అందిస్తున్న కారణంగా చాలా మంది డైరీఫాంలు, షీప్ ఫాంలు, గోట్‌ఫాంలు లాంటివి ఏర్పాటు చేసుకుంటున్నారు. హైబ్రిడ్ పద్దతి ద్వారా జరిగే చర్యలతో పశువులసంఖ్య గణనీయంగా పెరుగుతోంది. అయితే జిల్లాలో పెరుగుతున్న పశువుల సంఖ్యపై స్పష్టత లేకపోవడంతో ప్రభు త్వం ఈ సర్వే ప్రక్రియకు శ్రీకారం చుట్టింది. ఈ సర్వే ఆధారంగా ఒక్కో గ్రామంలో పశుసంపద ఎంత మేరకు ఉందో వెల్లడి కానుంది. దీంతో ఆ గ్రామంలోని ప్రజల ఆర్థికస్థితి గతులపై కూడా స్పష్టత వస్తుందని అంటు న్నారు. సోషియో ఏకనామిక్ తరహాలోనే ఈ సర్వే ఉపయోగపడునుందని అంటున్నారు.

### 488 గ్రామాల్లో సర్వే..

జిల్లాలోని మొత్తం 488 గ్రామాల్లో పశుగణన కార్యక్రమాన్ని చేపట్టేందుకు అధికారులు పకడ్బందీ చర్యలు చేపట్టారు. అయితే మొత్తం 488 గ్రామాలకు గాను ఇప్పటి వరకు 289 గ్రామాల్లో ఈ సర్వే కొనసాగుతుండగా మరో 199 గ్రామాల్లో సర్వేను కొద్దిరోజుల్లోనే మొదలుపెట్టబోతున్నారు. ఈ సర్వే ఆధారంగా ఏఏ గ్రామాల్లో పశుసంపద ఎక్కువగా ఉందన్న విషయం కూడా నిర్ధారణ కాబోతోంది. దీంతో పాటు గొర్రెలు, మేకల సంఖ్య కూడా వెల్లడి కానుంది. అలాగే ఇతర అన్ని రకాల పశువుల సంఖ్యను కూడా లెక్కించబోతున్నా రు. పశుసంపద ఎక్కువగా ఉన్న గ్రామాలను సోషియో ఎకనామిక్ స్టేటస్ గ్రామాలుగా గుర్తిస్తారు. అయితే పశుసంపద తక్కువగా ఉన్న గ్రామాల్లో పశువుల పెంపకం ఎక్కువగా జరగకపోతుండడం లాంటి కారణాలను సైతం ఈ సర్వే సందర్భంగా తెలుసుకోనున్నారు. అలాగే ఔత్సాహికులను కూడా ప్రోత్సాహించే విధంగా ఈ సర్వే తోడ్పడబోనుందని చెబుతున్నారు.

### పశువులను వెంటాడుతున్న పీపీఆర్ వ్యాధి..

కాగా పశువుల సర్వే సందర్భంగా ఓ వైపు పశువుల సంఖ్యనే కాకుండా గొర్రెలు, మేకలకు సంక్రమించే పీపీఆర్ వ్యాధిపై కూడా లెక్కలు తీస్తున్నారు. దీంతో వాటికి అవసరమైన మేరకు టీకాలను కూడా వేస్తున్నారు. ముఖ్యంగా గొర్రెలు, మేకలకు ఈటీకాలు ఇస్తారు. జిల్లాలో మొత్తం 5,54,600 గొర్రెలు, మేకలున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఇందులో నుంచి ఇప్పటి వరకు 2,74,457 గొర్రెలు, మేకలకు 47 పశువైద్యశాలల ఆధ్వర్యంలో టీకాలు వేసినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం జిల్లా వ్యాప్తంగా 82 మంది ఎన్యూమరేటర్లు ఇంటింటికి తిరుగుతూ బహుళ ప్రయోజనాలతో కూడిన ఈ సర్వేలో పాల్గొంటున్నారు. కాగా సర్వే వివరాలను అధికారులు ఎప్పటికప్పుడు కంప్యూటరీకరణ చేస్తూ ఆన్‌లైన్‌లో వివరాలను నమోదు చేస్తున్నారు.

### పకడ్బందీగా పశుగణన కార్యక్రమాన్ని చేపడుతున్నాం..



అఖిల భారత పశుగణన కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహిస్తున్నాము. సోషియో ఎకనామిక్ సర్వే మాదిరిగానే ప్రతి ఇంటిలో పశువులు, గొర్రెలు, మేకలు, కుక్కలు, కోడి పిల్లల వంటి వివరాలను సేకరిస్తున్నాము. పశుగణన చేపడుతున్న తమ సిబ్బందికి జిల్లా ప్రజలు సహకరించాలి.

జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ యండి. బలీగ్‌హైమద్



## గ్రూప్- 2 పరీక్షా కేంద్రాల వద్ద 163 సెక్షన్ అమలు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 15, 16న జిల్లాలో జరుగబోయే గ్రూప్-2 పరీక్షా కేంద్రాల పరిధిలో 163 భారతీయ నాగరిక్ సురక్షా సంహితచట్టం అమలులో ఉంటుందని ఎస్పీ జానకీషర్మిల శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. 15న ఉదయం 6 గంటల నుంచి 16న సాయంత్రం 6 వరకు ఈ ఆంక్షలుంటాయని తెలిపారు. పరీక్ష సమయంలో సమీపంలో ఇంటర్నెట్, జిరాక్స్ సెంటర్లు, స్టేషనరీ దుకాణాలు మూసి వేయాలని సూచించారు. ప్రశాంతంగా పరీక్షలు జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరిం చారు. కేంద్రాల పరిసరాల్లో పెట్రోలింగ్ పార్టీలను నియమించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గట్టి భద్రతా ఏర్పాట్లు చేశామని తెలిపారు. నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు.

## చిరుత పాద ముద్రల సేకరణ

కుంటాల, డిసెంబరు, 13: (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దౌనెల్లి - కుంటాల గ్రామాల మధ్య చిరుత సంచరిస్తుందన్న సమాచారం మేరకు శుక్రవారం అటవీ శాఖ అధికారులు పులి పాద ముద్రలను సేకరించారు. దౌనెల్లి గ్రామం నుండి ట్రాక్టర్‌లో సెంట్రింగ్ చెక్కలు తీసుకవస్తున్న సమయంలో కుంటాల గ్రామస్తుడికి చిరుత కనిపించిందన్న సమాచారంతో ఎఫ్‌ఎస్‌వోలు పూర్ణిమ, కీర్తిరెడ్డిలు డీఆర్‌వో రేష్మ, ఎఫ్‌బీవోలు ముస్తాక్, హరిలత, మహేష్, టాస్క్‌ఫోర్స్ టీం పాల్గొని పులి పాదముద్రలను సేకరించారు.

## లక్ష్మణచాందలో దొంగతనం



లక్ష్మణచాంద, డిసెంబరు 13 (ఆంధ్ర జ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఇట్టెం స్వప్న ఇంట్లో దొంగతనం జరిగినట్లు ఎస్సై సుమలత శుక్రవారం తెలిపారు. ఆమె తెలిపిన వివరాల ప్రకారం... శుక్రవారం రాత్రి వారి ఇంటికితాళం వేసుకొని వారి బంధువుల ఇంట్లో నిద్రపోగా రాత్రి సమయంలో ఎవరో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న రూ. 20 వేల నగదును దొంగిలించారు. ఈ సమాచారం తెలిసిన పోలీసులు వెంటనే డాగ్ స్క్వాడ్‌ను పిలిపించి క్షుణ్ణంగా పరిశీలించడం జరిగిందన్నారు. స్వప్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో

## బీజేపీ ఆధ్వర్యంలో ప్రసాదాల వితరణ



ప్రసాదలను పంపిణీ చేస్తున్న ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహారాష్ట్రలో ఫడ్నవీస్ సారధ్యంలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటైన సందర్భాన్ని పురస్కరించుకొని భైంసాలో బీజేపీ ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని చేపట్టింది. స్థానిక పద్మావతీ కాలనీ పరిధిలోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ చేతుల మీదుగా బీజేపీ ప్రసాదాల వితరణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాంరావ్ పాటిల్, భైంసా బీజేపీ అధ్యక్షులు ఎనుపోతుల మల్లేశ్వర్,మున్సిపల్ కౌన్సిలర్ గౌతం పింగ్లే, పార్టీ ప్రతినిధులు రావుల పోశెట్టి ముల్లావార్ అనిల్, తోట లింగురామ్, మానిక్ దగ్గే సారధ్యంలో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేపట్టి ప్రసాదాల వితరణ చేపట్టారు. బీజేపీ బృందానికి ఆలయ కమిటీ ప్రతినిధులు గుజ్జల్‌వార్ వెంకటేష్, సాధుల నారాయణ, కలొగోట రాములు, కళ్యాణ్ తదితరులు స్వాగతం పలికి సన్మానం నిర్వహించారు.

## కేజీబీవీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించండి

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ మండలం అనంతపేట్ కేజీబీవీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని సీపీఎం నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం వారు మాట్లాడుతూ... తీవ్ర నీటి కొరత ఉందని, విద్యార్థులు మూడు రోజులకోసారి స్నానాలు చేసే పరిస్థితి నెలకొందన్నారు. విద్యార్థుల ఆరోగ్యాలపై ప్రభావం చూపుతోందని ఆందోళన వ్యక్తపరిచారు. విద్యార్థి సంఘాలను కేంద్రంలోకి అనుమతించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మౌలిక వసతులు కల్పించాలని లేనట్టయితే పెద్ద ఎత్తున ఉద్యమం చేపడతామని హెచ్చరించారు. నాయకులు ఫసియుద్దీన్, డి. పోశెట్టి, తొడసం శంభు, అతిక్, తదితరులు పాల్గొన్నారు.

## కొనసాగుతున్న సమగ్రశిక్షా ఉద్యోగుల సమ్మె



టీ తయారు చేస్తూ నిరసన తెలుపుతున్న ఉద్యోగులు

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని సమగ్ర శిక్ష ఉద్యోగులు శుక్రవారం తమ సమ్మె కొనసాగించారు. జాతీయ రహదారి 44పై టీ తయారు చేస్తూ నిరసన తెలిపారు. టీ తాగినంత సమయంలో సమస్యలు పరిష్కరిస్తామన్న సీఎం హామీ ఏమైందని వారు ప్రశ్నించారు. ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలని నాయకుడు పడాల రవీందర్ డిమాండ్ చేశారు. లేనట్టయితే రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె ఉధృతం చేస్తామన్నారు. పేస్కేల్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం ప్రకటించారు. సమగ్ర శిక్ష ఉద్యోగ సంఘ నాయకులు భూసారం గంగాధర్, రాజారత్నం, ఆనంద్, నవిత, వీణ, అపర్ణ, తదితరులు పాల్గొన్నారు.

## నేడు పాఠశాలలకు పని దినం

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని అన్ని యాజమాన్యాల ప్రభుత్వ పాఠశాలలు శనివారం యధావిధిగా పని చేయనున్నట్లు డీఈవో రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాకాలంలో సెలవు ఉపయోగించుకున్నందున ఈ వారం పనిదినంగా ఉంటుందన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నెలవారీ మరమ్మతులలో భాగంగా శనివారం నిర్మల్ టౌన్, ఆదర్శనగర్ సబ్‌స్టేషన్‌ల పరిధిలో ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని అధికారులు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

# మహిళల అభివృద్ధే సమాజ అభివృద్ధి

మంత్రి ధనసరి అనసూయ (సీతక్క)



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ధనసరి అనసూయ సీతక్క, వేదికపై ఎమ్మెల్యే వెడ్మబొజ్జు, ఎమ్మెల్సీ దండే విఠల్,కలెక్టర్

నిర్మల్ అర్బన్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్, మహిళా, శిశుసంక్షేమశాఖ, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. శుక్రవారం నిర్మల్ కలెక్టరేట్ ప్రాంగణంలో అంబులెన్స్‌లు, ఇందిరా మహిళాశక్తి, విజయడైరీ క్యాంటీన్లను కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకీషర్మిల, ఖానాపూర్ శాసనసభ్యులు వెడ్మ బొజ్జుపటేల్, ఎమ్మెల్సీ దండేవిఠల్‌లతో కలిసి మంత్రి ప్రారంభించారు. అనంతరం సమావేశ మందిరంలో అధికారులతో జిల్లా అభివృద్ధిపై మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. మహిళలు అభివృద్ధి చెందినప్పుడే సమాజం అభివృద్ధి సాధిస్తుందన్నారు. మహిళా సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని తెలిపారు. పావలా వడ్డీకే కోటి మంది మహిళలకు రుణాలను అందిసామన్నారు. మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదిగేలా 17 రకాల వ్యాపారాలను గుర్తించామన్నారు. అభివృద్ధిలో మహిళలు భాగస్వాములు కావాలని కోరారు. బ్యాంక్ రుణాలు తీసుకోవడం, తిరిగి చెల్లించడంలో జాతీయస్థాయిలో అవార్డులు తీసుకున్నటువంటి జిల్లా మహిళలకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. మహిళల కోసం ప్రభుత్వం ఉచిత బస్సు సౌకర్యం, 200ల యూనిట్ల ఉచిత కరెంటు, 500ల రూపాయలకే గ్యాస్ సిలిండర్లను అందిస్తున్నామని తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకాన్ని 10 లక్షలకు పెంచడం జరిగిందన్నారు. యువతకు ఉద్యోగాలను భర్తీ చేస్తున్నామని, రైతులకు 2 లక్షల రుణమాఫీ చేయడం జరిగిందని తెలిపారు. నియోజకవర్గానికి 3,500ల చొప్పున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. అభివృద్ధికి అందరూ సహకరించాలని ఈ సందర్భంగా మంత్రి కోరారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలను అధికారులు, ప్రజా ప్రతినిధుల సమన్వయంతో అమలు చేస్తున్నామని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల కోసం జిల్లాలో 1 లక్ష 93 వేల దరఖాస్తులు వచ్చాయని, సమర్థవంతంగా సర్వే పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటు న్నామని తెలిపారు. 57 సంక్షేమ వసతిగృహాల్లో బాలశక్తి కార్యక్రమాన్ని అమలు చేస్తున్నామని 30 వేల విద్యార్థులకు పౌష్టికాహారం, వైద్యచికిత్సలతో పాటు ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అనంతరం ఇందిరాక్రాంతి పథకం మహిళా సంఘాలకు 400 కోట్ల బ్యాంక్ లింకేజీ చెక్కును, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో అమ్మ రక్షిత కార్యక్రమ పోస్టర్లను మంత్రి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమాల్లో అదనపు కలెక్టర్లు ఫైజాన్‌అహ్మద్, కిషోర్‌కుమార్, ఆర్డీవో రత్నకల్యాణి, మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్, అధికారులు, మహిళలు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

### జిల్లాలో మహిళా శక్తి ద్వారా రూ. 400ల కోట్ల రుణాలు

- ఇప్పటికే 97 శాతం రుణాలు పూర్తి : మంత్రి సీతక్క

ఖానాపూర్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మహిళల అభివృద్ధితోనే సమాజ అభివృద్ధి సాధ్యమని రాష్ట్ర మంత్రి సీతక్క అలియాస్ ధనసరి అనసూయ అన్నారు. శుక్రవారం రాత్రి ఖానాపూర్‌లో నిర్వహించిన పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా అటవీశాఖ ఆధ్వర్యంలో పట్టణ శివారు ప్రాంతంలో మస్కాపూర్ బీట్ పరిధిలో నిర్మాణం చేసిన అర్బన్ పార్క్‌ను ఆమె ప్రారంభించారు. అనంతరం పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఇందిరా మహిళాశక్తి ఇందిరా క్రాంతి పథకం ద్వారా మహిళాశక్తి పథకంలో భాగంగా బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళలకు 60 కోట్ల చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. మహిళలకు రూ. 1.34 కోట్ల వడ్డీ లేని రుణాలను అందజేసినట్లు తెలిపిన మంత్రి ఆ చెక్కులను మహిళా సంఘాలకు అందజేశారు. జిల్లాలో రూ. 400ల కోట్ల రుణాలను బ్యాంక్ లింకేజీ ద్వారా మహిళా సంఘాలకు అందజేస్తున్నట్లు తెలిపిన మంత్రి ఇప్పటికే 97 శాతం రుణాల అందజేత పూర్తి అయినట్లు తెలిపారు. హైదరాబాద్, శిల్పారామం లాంటి ప్రదేశాల్లో ఆదిలాబాద్ జిల్లాకు సంబంధించిన మహిళలు తయారు చేసిన ఇప్ప పువ్వు లడ్డు, నిర్మల్ బొమ్మలు లాంటివి ప్రదర్శించేందుకు స్టాల్స్‌ను సైతం ఏర్పాటు చేశామన్నారు. నిర్మల్ ప్రాంతంలో మహిళలు తయారు చేస్తున్న వరి కుచ్చులను ముఖ్యమంత్రి సైతం మెచ్చుకున్నారన్నారు.



మహిళా సంఘాలకు రూ.60 కోట్ల చెక్కును అందజేస్తున్న మంత్రి సీతక్క

### గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణంపై నాడు బాండ్ పేపర్ రాసి ఇచ్చాను

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

అసెంబ్లీ ఎన్నికల సమయంలో గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణంపై నాడు తాను బాండ్ పేపర్ రాసి ఇచ్చానని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. ఇచ్చిన హామీ మేరకు ప్రస్తుతం తన విన్నపాన్ని మన్నించి ప్రభుత్వం బ్రిడ్జి మంజూరు చేయడం అభినందనీయమన్నారు. రూ.22 కోట్లతో గంగాపూర్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టనున్నామని పేర్కొన్నారు. గంగాపూర్ ప్రాంతంలో మూడు గ్రామ పంచాయతీలు 3,000ల జనాభా ఉంటుందన్నారు. కాంగ్రెస్ పార్టీ హయాంలోనే గతంలో సదర్మాట్ మినీ బ్యారేజీ నిర్మాణానికి అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ఆర్ రూపకల్పన చేశారన్నారు. ప్రస్తుతం బ్యారేజీ నిర్మాణ పనులు పూర్తవుతున్నాయని త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా సదర్మాట్ బ్యారేజీని ప్రారంభిస్తామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సదర్మాట్ బ్యారేజీ నిర్మాణం పూర్తవుతున్న నేపథ్యంలో ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ఏడు కిలోమీటర్ల ప్రత్యేక కెనాల్ నిర్మాణం సైతం పూర్తి చేస్తామన్నారు. సదర్మాట్ నిర్మాణం పూర్తయితే ఈ ప్రాంతంలో మూడు పంటలు పండి ప్రాంతమంతా సస్యశ్యామలమవుతుందన్నారు. ఖచ్చితంగా ఖానాపూర్ ప్రాంతం అంటే ముఖ్యమంత్రి రేవంతన్నకు అత్యంత ప్రేమ అని ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయిస్తారని ఎమ్మెల్యే ఆశాభావం వ్యక్తం చేశారు.

### అప్పులభారంతో ఉన్నా మాటను నిలుపుకుంటున్నాం : ఎమ్మెల్సీ విఠల్

అప్పులభారంతో అధికారంలోకి వచ్చినా ఇచ్చిన మాటను నిలుపుకునేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్సీ దండే విఠల్ అన్నారు. 7 లక్షల కోట్ల అప్పులతో పాటు లక్ష కోట్ల పెండింగ్ బకాయిల భారంతో ప్రభుత్వం ఏర్పడిన ప్రజలకు ఇచ్చిన అన్ని హామీలను నెరవేర్చడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారన్నారు. ఐకేపీని మొదలుపెట్టిందే కాంగ్రెస్ ప్రభుత్వమని ప్రస్తుతం జిల్లా ఐకేపీకి రాష్ట్రంలోనే పలుమార్లు ఉత్తమ అవార్డు పొందడం అభినందనీయమన్నారు. అనంతరం కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ... ప్రభుత్వం ఖానాపూర్ ప్రాంతం అభివృద్ధిపై ప్రత్యేకశ్రద్ధ పెట్టిందన్నారు. ఇటీవల పెంబిలో రూ.3 కోట్లతో పీహెచ్‌సీ భవనాన్ని ఏర్పాటు చేయడంతో పాటు వైద్యపరంగా ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా నియోజకవర్గానికి మూడు అంబులెన్స్‌లను కేటాయించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో తొలిసారిగా మహిళా పీఏసీఎస్‌లను సైతం ఏర్పాటు చేయనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం ఖానాపూర్ మండలంలోని సత్తెనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని మంత్రి సీతక్క చేతుల మీదుగా ప్రారంభించారు.

### నియోజకవర్గ సమస్యలను పరిష్కరించండి

నియోజకవర్గంలో నెలకొన్న పలు సమస్యలను పరిష్కరించాలని సీపీఎంఎల్ మాస్ లైన్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య మంత్రి సీతక్కను కోరారు. ఈ మేరకు శుక్రవారం రాత్రి ఖానాపూర్‌లోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మంత్రికి ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ ఏరియా ఆసుపత్రిగా మార్చాలని ఆయన కోరారు. ఖానాపూర్ పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఖానాపూర్‌ను ఇచ్చిన హామీ మేరకు రెవెన్యూ డివిజన్‌గా మార్చాలని, సాగు భూములకు త్రీఫేస్ కరెంటు సరఫరా చేయాలని ఆయన కోరారు.

## బూత్ కమిటీల ఎన్నికలకు సన్నద్ధం : బీజేపీ



నిర్మల్ కల్చరల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బూత్ కమిటీల ఎన్నికలకు సన్నద్ధంగా ఉన్నట్టు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు కే. అంజుకుమార్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ... జిల్లాలోని మూడు నియోజకవర్గాల్లో బూత్‌ల వారీగా పత్రాల పరిశీలన జరుగుతుంద న్నారు. బూత్‌లను పూర్తిస్థాయిలో పటిష్టం చేసేందుకు కార్యకర్తలు కృషి చేస్తున్నారని స్పష్టం చేశారు. ముథోల్, ఉట్నూర్, ఇంద్రవెల్లి మండలాల బూత్ కమిటీల నియామకానికి సిద్ధం చేసినట్టు తెలిపారు. సంఘటన అసిస్టెంట్ ఆర్‌వో సామ రాజేశ్వర్ రెడ్డి, క్రియాశీల సభ్యత్వ కోఆర్డినేటర్ రాచకొండ సాగర్, ప్రాథమిక సభ్యత్వ కన్వీనర్ కమల్‌నయన్, రమేష్, వెంకటేష్, కైలాష్, శైలేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

## ముథోల్‌లో ఇన్‌చార్జి మంత్రికి వినతుల వెల్లువ

ముథోల్, డిసెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : నియోజకవర్గ కేంద్రమైన ముథోల్‌లో శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్కకు పలువురు వినతి పత్రాలను అందజేశారు. మంత్రి ముథోల్ గురుకుల పాఠశాలలో పెంచిన మెనూను శుక్రవారం మంత్రి ప్రారంభించాల్సి ఉండగా సమయబావంతో బాసర పర్యటన ముగించుకొని నిర్మల్‌కు వెళ్తుండగా ముథోల్‌లో గురుకుల పాఠశాల ఎదుట ప్రజలు గుమిగూడి ఉండటంతో మంత్రి తన వాహనాన్ని కొంత సేపు ఆపారు. దీంతో జర్నలిస్టులు తమ కాలనీలో జనరల్ కమ్యూనిటీ హాల్ మంజూరు చేయాలని, పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు తమకు నాలుగు నెలల నుండి వేతనాలు అందలేవని అలాగే సమస్యలు పరిష్కరించాలని కోరారు. అంగన్‌వాడీ కార్యకర్తలు తమకు మినీ నుండి మేన్ అయిన అంగన్‌వాడీ కార్యకర్తల 7 నెలల పెండింగ్ వేతనాలు అందజేయాలని విన్నవించారు. అలాగే ముథోల్‌కు చెందిన జనార్ధన్ అనే వ్యక్తి తిరుపతి దర్శనంకు వెళ్లి తిరుగు ప్రయాణంలో గూడూరు రైల్వేస్టేషన్‌లో తప్పిపోయి రెండు నెలలు కావస్తున్నా అతని ఆచూకీ దొరకడం లేదని తమ భర్త ఆచూకీ కనుక్కోవాలని అతని భార్య పుష్ప మంత్రిని వేడుకుంది.



మంత్రికి ముథోల్‌లో రోడ్డుపై వినతిపత్రాలు అందజేస్తున్న ప్రజలు

అంతేకాకుండా పలువురు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు. తాము ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని మంత్రిని కోరారు. బిజీ షెడ్యూల్ ఉన్నప్పటికీ మంత్రి రోడ్డుపై వినతి పత్రాలను స్వీకరించారు. పలువురి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.